
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

గుంటూరు జిల్లా వార్తలు

ఆదివారం 29 డిసెంబరు 2024

అరాచకం నుంచి అభివృద్ధి వైపు

దాడులు.. దౌర్జన్యాలు.. కక్ష సాధింపులు.. కేసులు.. అరాచకాలు.. అక్రమాలు.. ఊసే లేని అభివృద్ధి కార్యక్రమాలు.. ఇదీ గత ఐదేళ్ల వైసీపీ పాలన తీరు. వైసీపీ అరాచక పాలన నుంచి కూటమి ప్రభుత్వ అభివృద్ధి పరిపాలన దిశగా 2025 నూతన సంవత్సరం అందుకు వేదికగా నిలుస్తోందని జిల్లావాసులు ఎదురుచూస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించి తమకు మంచి చేస్తారని కూటమి నేతలను అధికారంలో కూర్చోబెట్టారు. పింఛన్‌ని రూ.4 వేలకు పెంచుతూ సంక్షేమంతో టీడీపీ కూటమి ప్రభుత్వ పరిపాలన ప్రారంభం కాగా నేడు అభివృద్ధి వైపు ఒడిఒడిగా అడుగులు పడుతున్నాయి. అమరావతి రాజధాని నగరాన్ని కలిగిన జిల్లాలో ఆ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.15 వేల కోట్ల సాయంతో అమరావతిలో నిలిచిపోయిన ప్రాజెక్టులన్నీ ఒక్కొక్కటిగా పునఃప్రారంభం అవుతున్నాయి. ఈ పరిణామాలతో అభివృద్ధి విషయంలో ప్రజానీకానికి కొత్త ఆశలను చిగురింప చేస్తున్నాయి.


జూలైలో పెనుమాకలో పెంచిన పింఛన్ రూ. 4 వేల పంపిణీని ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

- ఓటుతో వైసీపీకి బుద్ధి చెప్పిన జిల్లా ఓటర్లు
- ఆశలను చిగురింప చేస్తోన్న కూటమి ప్రభుత్వం
- రహదారులపై గుంతలు లేకుండా ప్యాచ్‌వర్కులు
- అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్ల కేంద్ర సాయం
- రూ.4 వేలకు పింఛన్ పెంచి టంఛన్‌గా పంపిణీతో ఆనందం
- గుంటూరులో శంకర్‌విలాస్ ఆర్‌వోబీ నిర్మాణానికి సన్నాహాలు



అమరావతిలో నిర్వహించిన డ్రోన్ సమ్మిట్

గుంటూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనను ఒక పీడకలగా భావించి జిల్లా ప్రజానీకం ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నది. ఆ పార్టీ నేతల అరాచకాలను దిగమింగుతూ ఎంతో ఓపికను ప్రదర్శించి ఓటింగ్ రోజున ప్రజలు తమ బలాన్ని ప్రదర్శించారు. వైసీపీ ప్రభుత్వం అమరావతి రాజధానిపై కక్ష కట్టినట్టుగా వ్యవహరించింది. అభివృద్ధి పనులను నిలిపేసి పైశాచికత్వాన్ని ప్రదర్శించింది. అయితే అమరావతి రాజధాని రైతులు వీరోచితంగా పోరాటాలు చేసి ఎన్ని వేధింపులు ఎదురైనా ఎదుర్కొని నిలిచి అమరావతిని నిలుపుకున్నారు. ఒక విధంగా వైసీపీ పునాదులు కదిలించడానికి అమరావతి మహిళల పోరాటాలే బీజం వేశాయి. ఒక్క అమరావతినే కాకుండా గుంటూరు జిల్లాకు సంబంధించి అన్ని ప్రాజెక్టులను వైసీపీ నిలిపేసింది. గుంటూరు నగర భూగర్భ మురుగునీటి పథకం, గుంటూరు ఛానల్ పొడిగింపు, విస్తరణ, నల్లమడ డ్రెయిన్ ఆధునికీకరణ, అమరావతి నూతన రైలుమార్గం తదితర పనులకు చిల్లిగవ్వ ఇవ్వకుండా నిర్దాక్షిణ్యంగా వ్యవహరించింది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, మార్కెట్ కమిటీల ఆదాయాలను లాగేసుకుని వాటిని దయనీయమైన స్థితికి చేర్చింది. దీంతో రోడ్లపై కనీసం గుంతలు పూడ్చలేని స్థితికి ఆయా సంస్థలు చేరుకున్నాయి.

కసితీరా ఓటు..

ఎప్పుడెప్పుడు అవకాశం వస్తుందా... వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదింపి మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకొందామా అని ప్రజలు ఎదురు చూశారు. మే 13 పోలింగ్ డే రూపంలో వారికి అవకాశం వచ్చింది. ఆ రోజున ప్రజలు కసితీరా ఓటు వేశారు. కూటమి అభ్యర్థులే ఆశ్చర్యపోయేలా తీర్పు ఇచ్చారు. జిల్లాలో ఒక లోక్‌సభ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో భారీ మెజార్టీలతో కూటమి అభ్యర్థులను గెలిపించారు. గుంటూరు లోక్‌సభ స్థానంలో టీడీపీ నుంచి పెమ్మసాని చంద్రశేఖర్‌ని 3,44,695 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందించు కున్నారు. ప్రజలు చూపించిన అభిమానాన్ని గౌరవి స్తూ సీఎం చంద్రబాబు ఆయనకు కేంద్ర కేబినెట్‌లో సహాయ మంత్రి పదవిని ఇప్పించారు. అలానే జిల్లా నుంచి భారీ మెజార్టీలతో ఎన్నికైన నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్‌కు తన మంత్రివర్గంలో చోటు కల్పించి గుంటూరు జిల్లాపై తనకున్న ఇష్టాన్ని చంద్రబాబు చాటి చెప్పారు.

సంక్షేమంతో ఆనందోత్సాహాలు

వైసీపీ ప్రభుత్వం గద్దె దిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజున జిల్లా ప్రజలు వీధివీధినా దీపావళి బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెంచిన పింఛన్ మూడు నెలలు కలిపి నాల్గో నెల అయిన జూలై 1న పింఛన్‌దారుల చేతుల్లో 7 వేల నగదు పెట్టడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అది మొదలు ప్రతీ నెలా ఒకటో తేదీన, ఒకవేళ ఆ రోజు సెలవుదినమైతే ముందురోజునే పింఛన్ల పంపిణీ చేస్తూ లబ్ధిదారులకు ప్రభుత్వం ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నది. 2 లక్షల 54 వేల 71 మంది ఆనందోత్సాహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులకు కూడా ప్రతీ నెలా ఒకటో తేదీనే ప్రభుత్వం జీతాలు విడుదల చేస్తున్నది. దీపావళి పండగ నుంచి తన సూపర్‌సిక్స్ హామీల అమలులో భాగంగా రెండోదైన ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్ల ఉచిత పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. తెల్లరంగు కార్డు కలిగి ఆధార్ లింక్ అయి ఉన్న వంట గ్యాస్ వినియోగదారులకు ఈ ఏడాదికి సంబంధించి ఒక సిలిండర్‌కి రాయితీని విడుదల చేస్తున్నది. ఇప్పటికే మూడు లక్షల మందికి పైగా ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. దీనిపై వంటింటి మహిళలంతా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధికి కల్పతరువు అమరావతి

అమరావతి రాజధాని జిల్లాకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ఒక కల్పతరువు లాంటిది. రాజధానిలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి కేంద్రం తొలి బడ్జెట్‌లోనే రూ.15 వేల కోట్లను కేటాయించింది. ఆ నిధులతో మళ్లీ టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తున్నారు. రూ.37 కోట్లతో జంగిల్ క్లియరెన్స్‌ని పూర్తి చేసి పనులను మొదలుపెట్టడానికి సిద్ధం చేశారు. రూ.800 కోట్లతో హ్యాపీనెస్టు హైరైజ్ బిల్డింగ్స్ నిర్మాణానికి టెండర్లు కూడా పిలిచింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్, ఐపీఎస్‌ల నివాసాల పనులను ప్రారంభిస్తున్నది. ఇటీవలే సీఎం చంద్రబాబునాయుడు రాజధానిలో పర్యటించి పనులకు శ్రీకారం చుట్టారు. తరచుగా సీఆర్‌డీఏ సమావేశాలు నిర్వహిస్తూ పురోగతిని సమీక్షిస్తున్నారు. మంగళగిరి సీకే కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ డ్రోన్ సమ్మిట్ ద్వారా మరోసారి అమరావతి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది.


కూటమి ప్రభుత్వం ప్రారంభించిన రోడ్డు ప్యాచ్‌వర్కులు


శంకర్‌విలాస్ ఆర్‌వోబీ డిజైన్లను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పరిశీలిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని, కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యేలు రామాంజనేయులు, మాధవి

అధికార యంత్రాంగంలో కొత్తనీరు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తన టీంని జిల్లాకు ఏర్పాటు చేసుకున్నది. కలెక్టర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి ఎస్ నాగలక్ష్మికి బాధ్యతలు అప్పగించింది. ఎస్పీగా సతీష్‌కుమార్, నగరపాలకసంస్థ కమిషనర్‌గా అనుభవం ఉన్న పులి శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్‌గా భార్గవతేజలను కూటమి ప్రభుత్వం నియమించింది. దాంతో వారు తమ బాధ్యతలను నెరవేరుస్తూ జిల్లాని ప్రగతిపథంలో నిలిపేందుకు కృషి చేస్తున్నారు. గంజాయిపై జిల్లా పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపింది.

శంకర్‌విలాస్ ఆర్‌వోబీకి మోక్షం

రెండు దశాబ్దాలకు పైగా ప్రతిపాదనలకే పరిమితమైన శంకర్‌విలాస్ ఆర్‌వోబీకి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ రూ.110 కోట్లను మంజూరు చేయించారు. బ్రిడ్జి పనులను కొత్త సంవత్సరంలో మార్చి నెల నుంచి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు. ఈ బ్రిడ్జి నాలుగు వరసల్లో నిర్మాణం పూర్తి అయితే నగరానికి చాలావరకు ట్రాఫిక్ సమస్య తగ్గిపోనున్నది. జిల్లాలో రోడ్లను వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు గాలికి వదిలేసింది. దాంతో ఎక్కడికక్కడ గుంతలు పడి కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా తయారయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే సంక్రాంతి నాటికి రోడ్లపై గుంతలన్ని పూడ్చాలని లక్ష్యాన్ని నిర్దేశించింది. ఆ మేరకు నిధులు విడుదల చేశారు. దాంతో గత రెండు నెలల నుంచి రోడ్లపై ప్యాచ్‌వర్కులు పెద్దఎత్తున జరుగుతున్నాయి. ఒక్క గుంటూరు నగరపాలకసంస్థలోనే ఐదు నెలల వ్యవధిలో రూ.168 కోట్ల పనులు ప్రారంభమయ్యాయి.

రైతులకు భారీగా ఇన్‌పుట్ సబ్సిడీ

ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు కృష్ణానదికి ఎన్నడూ చూడనంతగా వరద వచ్చింది. దాంతో వారం నుంచి 10 రోజుల పాటు పంటలు నీట మునిగాయి. రైతులు తీవ్రంగా నష్టపోవడంతో ప్రభుత్వం వెనువెంటనే పంట నష్టం అంచనాలు వేయించి ఇన్‌పుట్ సబ్సిడీని విడుదల చేసి ఆదుకున్నది. దాదాపుగా రూ.64 కోట్లు విడుదలతో రైతులు తిరిగి పంటల సాగు చేపట్టగలిగారు.

సమాజం బాగుంటేనే సంతోషం

- సంపాదన కన్నా సమాజహితానికి ప్రాధాన్యమివ్వాలి
- ఆధునిక కోర్సులతో పాటు సంప్రదాయ కోర్సులను ప్రవేశపెట్టాలి
- సోషల్ మీడియా కార్యకలాపాలు మాతృభాషలో సాగించాలి
- వర్సిటీ పూర్వ విద్యార్థుల సంఘ సమావేశంలో జస్టిస్ ఎన్.వి.రమణ

పెదకాకాని, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సమాజం సంతోషంగా ఉంటే మనం కూడా బాగుంటామని.. ఆనందమయ జీవితాన్ని గడుపుతామని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ అభిప్రాయపడ్డారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థుల సంఘ సమావేశం వర్సిటీలోని డైక్‌మన్ ఆడిటోరి యంలో శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ రమణ మాట్లాడుతూ సమా జంలో అల్లర్లు, గొడవలు, కొట్లాటలు ఉంటే మనం సుఖమైన జీవితాన్ని గడపలేమన్నారు. ధన సం పాదన ముఖ్యమైనా దానికన్నా సమాజ హితానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మాతృ భాషకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మనలోని భావాలను మాతృ భాష ద్వారా వ్యక్తపరిస్తే అందులో కనిపించే భావోద్వేగం సరైన క్రమంలో చెప్పగలుగుతామన్నారు. నేటి రోజుల్లో అధికంగా వినియోగిస్తున్న సోషల్ మీడియా ద్వారా కూడా మన మాతృభాషలోనే కార్యకలాపాలు సాగిస్తే మాతృభాషకు పూర్వవైభవం తీసుకువస్తామన్నారు. దేశ విదేశాల్లో ఎక్కడ ఉన్నా మాతృ భాషను మరువరాదన్నారు. మాతృభాషతోపాటు ఇతర భాషలను కూడా అభిమానించాలని చెప్పారు. కోర్సులు పూర్తి కాగానే విద్యార్థులు ఉద్యోగాలతో బయటకు వెళ్లాలనే ఆలోచనతో ఇంజనీరింగ్ టెక్నాలజీ, ఫార్మసీ వంటి ఆధునిక కోర్సుల అభివృద్ధి వైపు వర్సిటీలు ఉన్నాయన్నారు. ఆధునిక కోర్సులతో పాటు సంప్రదాయ కోర్సులు కూడా ఎంతో ముఖ్యమన్నారు. అందులో తెలుగు, సంస్కృతం, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ వంటి సంప్రదాయ కోర్సులపై దృష్టి సారించాలని సూచించారు. తాము చదువుకునే రోజుల్లో అల్లర్లతో కూడిన ఆటపాటలు ఉన్నాయి కానీ ర్యాగింగ్ లేదన్నారు. రేకుల షెడ్లలో నాడు తరగతులు జరిగేవని, ఇప్పుడు విద్యార్థులకు అన్ని వసతులు ఉన్నాయన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు ఉండాలని ఆ నాయకత్వ లక్షణాలు వ్యక్తిగత హోదాని వ్యక్తిత్వాన్ని పెంపొందించేలా ఉండాల న్నారు. ఆ లక్షణాలు ఇతరులపై, ఇతర వ్యాపకా లపై ఉండకూడదని సూచించారు. విద్యార్థి నాయకులుగా విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తాము ఎక్కువ సమయం కేటాయించినట్లు గుర్తుచేసుకున్నారు. అధ్యాపకులు తమతోస్నేహంగా సోదరభావంతో ఉండే వారన్నారు. విద్యార్థి జీవితం ఎంతో మధురమైందని వివరిం చారు. విద్యార్థులు తమ ముందున్న లక్ష్యాలను నెరవేర్చుకునే క్రమంలో కృషి, పట్టుదల, అంకిత భావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. వృత్తి పట్ల నిబద్ధత ఉంటే ఏ రంగంలోనైనా రాణించవ చ్చన్నారు. ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే.గంగాధరరావు మాట్లాడుతూ వర్సిటీ అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల సహకారం మరువలేనిదన్నా రు. ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, ఇన్‌చార్జి రిజి స్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, పూర్వ విద్యార్థుల సంఘం డైరెక్టర్ ఆచార్య జీవీఎస్‌ఆర్. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



జస్టిస్ ఎన్.వి.రమణను సత్కరిస్తున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు తదితరులు

క్రీడాకారులకు ప్రోత్సాహకాలు పెంచిన ఘనత కూటమిదే..
- శాప్ చైర్మన్ రవినాయుడు

6

శిలలపై.. శిల్పాలు
- దుర్గి శిల్పం.. ఖండాంతర ఖ్యాతి
- 12వ శతాబ్దంలోనే శిల్పకళకు బీజం
- స్వదేశీ శిల్పకళకు ప్రాచుర్యం తెస్తోన్న శిల్పులు

8



తగ్గింది.. తప్పులున్నాయి

- భూ సమస్యలపై అర్జీల వెల్లువ
- 12,347 అర్జీల్లో ఇప్పటికి 976 పరిష్కారం
- మూడు జిల్లాలు.. 660 రెవెన్యూ సదస్సులు
- సమస్యల పరిష్కారంపై అధికారుల్లో తాత్సారం
- నీరుగారి పోతోన్న కూటమి ప్రభుత్వ ఉన్నతాశయం



బొల్లాపల్లి : గండిగనుమలలో రెవెన్యూ సదస్సులో రైతులతో అధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

విస్తీర్ణం తగ్గింది.. సరిహద్దుల్లో తేడాలున్నాయి.. సర్వే నెంబర్లల్లో అయోమయం.. ఆన్‌లైన్‌లో తప్పులు.. ఏ ప్రాంతంలో చూసినా భూ వివాదాలే.. ఇలాంటి భూ సమస్యలపై యజమానులు అర్జీలతో రెవెన్యూ కార్యాలయాలు, గ్రామసభలకు బారులు తీరుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతో మరింతగా పెరిగిన భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది. అయితే సదస్సుల లక్ష్యం అంతగా నెరవేరడంలేదని పరిష్కారమైన అర్జీలను చూస్తే తెలుస్తోంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో ఇప్పటి వరకు నిర్వహించిన సదస్సుల్లో బాధితులు 12,347 అర్జీలను అందజేశారు. వీటిలో 976 అర్జీలను మాత్రమే అధికారులు పరిష్కరించగలిగారు. భూ సమస్యల పరిష్కారం నామమాత్రంగా కూడా లేదన్న అభిప్రాయం బాధితుల్లో ఉంది. దీంతో ప్రభుత్వ లక్ష్యాలు నీరుగారిపోయే ప్రమాదం ఉంది. గత వైసీపీ ప్రభుత్వం ప్రచారార్భాటంతో అమలు చేసిన శాశ్వత భూహక్కు భూరక్ష పథకం రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేసింది. క్షేత్రస్థాయిలో హడావుడిగా భూముల రీసర్వే చేసి గందరగోళం సృష్టించడమే కాకుండా రైతులను సమస్యల సుడిగుండంలోకి నెట్టివేసింది. భూ విస్తీర్ణంలో వ్యత్యాసాలు, పొలాల సరిహద్దుల్లో తేడాలు, సర్వే నెంబర్లల్లో అయోమయం, పేర్లు తారుమారుతో రైతుల మధ్య గొడవలతో అల్లాడిపోతున్నారు. ఆయా తప్పులను సరిదిద్దడంపై గత వైసీపీ ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ చూపలేదు. ప్రచార యావతో రైతులకు అందజేసిన భూహక్కు పత్రాలు సరిహద్దు రాళ్లపై అప్పటి సీఎం జగన్ ఫొటోలు, పార్టీ రంగులు పేర్లు వేసుకోవడానికే అత్యధిక ప్రాధాన్యమిచ్చిన తీరు తీవ్ర విమర్శలకు దారితీసింది. వీటికి చెక్ పెట్టడానికి కూటమి ప్రభు త్వం నిర్మాణాత్మక చర్యలకు పూనుకుంది. అధికారం చేపట్టిన వెంటనే కూటమి ప్రభుత్వం భూముల రీ సర్వే ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేసింది. తప్పులను సరిదిద్దడానికి తొలి ప్రాధాన్యమిచ్చింది. ప్రత్యేకంగా రీ సర్వే జరిగిన గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించింది. ఈ సందర్భంగా స్వీకరించిన వేలాది అర్జీలు పరిష్కారానికి నోచుకోలేదన డానికి అధికారుల లెక్కలే నిదర్శనం. ఈ పరిస్థితుల్లో గత కొన్ని రోజులుగా మళ్లీ గ్రామాల పరిధిలో రెవెన్యూ సదస్సులను అధికారులు నిర్వహిస్తున్నారు. వీటిలో బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నారు. మూడు జిల్లాల వ్యాప్తంగా 660 రెవెన్యూ గ్రామాల్లో

(మిగతా 6వ పేజీలో)

యూజీడీని.. ఏమిచేద్దాం?

- అధికారులు, ప్రజాప్రతినిధులు మల్లగుల్లాలు
- పెండింగ్ నిధులు విడుదల చేసినా ప్రాజెక్టు అసాధ్యం
- రివైజ్డ్ అంచనాలు ఎంతవుతాయనే దానిపై అధ్యయనం
- ఆ తర్వాత కేంద్రానికి నివేదించి ముందుకెళ్లాలని యోచన


గుంటూరు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ స్కీమ్

గుంటూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒన్‌టైం అసిస్టెన్స్(ఒకసారి సాయం) కింద గుంటూరు నగరానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ(యూజీడీ) స్కీమ్‌ని ప్రస్తుతం ఏమి చేయాలో తెలియని పరిస్థితి నెలకొన్నది. దాదాపుగా రూ.500 కోట్లకు పైగా నిధులు ఖర్చు చేసిన ఈ ప్రాజెక్టుని ఏ విధంగా పూర్తి చేయాలనే దానిపై అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు మల్లగుల్లాలు పడుతున్నారు. అప్పటి ఎస్ఎస్ఆర్ ప్రకారం టెండర్లు పిలిచి ఏజెన్సీని ఎంపిక చేశారు. ఇప్పుడు రేట్లు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, గుంటూరు నగరపాలకసంస్థలు తమ వాటా నిధులు సమకూర్చినా ప్రాజెక్టు పూర్తి కాదు. అమరావతి రాజధానికి సమీపంలో అటు విజయవాడ, ఇటు గుంటూరు నగరం ఉండటంతో అప్పటి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వెంకయ్యనాయుడు రూ.903.82 కోట్లతో యూజీడీని మంజూరు చేశారు. కేంద్ర ప్రభుత్వం వాటా కింద రూ.540 కోట్లను విడుదల చేసింది. మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం, నగరపా లకసంస్థ భరించాలన్న షరతు విధించారు. 1083 కిలోమీటర్ల పొడవునా పైపులైన్లు నిర్మించాల్సి ఉండగా దాదాపుగా 505 కిలోమీటర్ల మేరకు పూర్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధుల్లో రూ.415 కోట్ల బిల్లులు ఏజెన్సీకి చెల్లించారు. గత వైసీపీ ప్రభుత్వం చిల్లిగవ్వ కూడా ఇవ్వకపోవ డంతో 2019లో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ట్రీట్‌మెంట్ ప్లాంట్లు కూడా తుప్పుపట్టిపోయాయి. ఈ విషయాన్ని కలెక్టర్ నాగలక్ష్మి ఇటీవలే సీఎం చంద్రబాబుకు నివేదించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున పెండింగ్‌లో ఉన్న నిధులు విడుదల చేయాలని ఆయన ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. అయితే ఆ నిధులతో ఇప్పుడు మిగతా జోన్లలో పనులు పూర్తి చేయలేమని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. మరోవైపు కేంద్రానికి ఈ పథకానికి సంబంధించిన నిధుల వినియోగం తాలూకా యుటిలైజేషన్ సర్టిఫికెట్ల(యూసీల)ను పంపాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో మొత్తం సమాచారంతో నివేదికని తయారు చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదించి అదనపు సాయం కోరాలని భావిస్తున్నారు. దీనిపై తాను కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రితో చర్చిస్తానని గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. దీంతో అధికారులు సమగ్ర నివేదికని సిద్ధం చేస్తున్నారు.

పిన్నెల్లి రాజకీయ సన్యాసం చేయాలి

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులు అంజయ్య



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అంజయ్య

మాచర్లటౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఓడిపోతే రాజకీయ సన్యాసం చేస్తానని చెప్పిన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తక్షణమే ఆ పని చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులు అంజయ్య డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిన్నెల్లి నోరు అదుపులో ఉంచుకోవాలని సూచించారు. ఐదేళ్లు జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తే పిన్నెల్లి మాచర్ల నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టించాడని చెప్పారు. వైసీపీ పాలనలో టీడీపీ వారిపై ఎన్నో కేసులు పెట్టి ఇప్పుడు పిన్నెల్లి నీతులు మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. టీడీపీ సీనియర్ నేత యెనుముల కేశవరెడ్డి మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ నేతలు సాగించిన అరాచకాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని, దారుణంగా ఓడించినా ఇంకా బుద్ధి రాలేదంటూ విమర్శించారు. వైసీపీ హయాంలోనే విద్యుత్ చార్జీలు పెంచిన విషయం మీకు తెలిదా పిన్నెల్లి అంటూ ప్రశ్నించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, షేక్ మోసీన్, మున్నా రాంబాబు, బాబుఖాన్ తదితరులు మాట్లాడారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నేత కజ్జం సైదయ్య, పేరువాల పుల్లారావు, వజ్రం నాయక్, మద్దిగపు వెంకట్రామిరెడ్డి, బండ్ల శ్రీనివాసరావు, కొమెర శివ, మాచర్ల వాసు, నర్రా గురవారెడ్డి, కళ్లం రామాంజిరెడ్డి, గోరంట్ల నాగేశ్వరరావు, బండారు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

జమ్ముపై జార్ఖండ్ 14 పరుగుల ఆధిక్యం



చైతన్య (4 వికెట్లు)

మంగళగిరి సిటీ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విజయ్ మర్చంట్ ట్రోఫీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జమ్ము, జార్ఖండ్ జట్ల మధ్య మూడు రోజుల మ్యాచ్ శనివారం ప్రారంభమైంది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న జమ్ము జట్టు 55.1 ఓవర్లలో 129 పరుగులకు ఆలౌటయింది. జమ్ము బ్యాటర్ ఫర్హాన్ అన్సారీ 41 పరుగులు చేయగా, జార్ఖండ్ బౌలర్ చైతన్య 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన జార్ఖండ్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 32 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. జార్ఖండ్ బ్యాటర్ సాకేత్ కుమార్ సింగ్ 40 పరుగులతో క్రీజులో ఉండగా, జమ్ము బౌలర్ హర్సిరత్ సింగ్ 2 వికెట్లు పడగొట్టాడు. జార్ఖండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 14 పరుగుల ఆధిక్యంలో నిలిచింది.

300 గ్రాముల గంజాయి స్వాధీనం

తెనాలి క్రైం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గంజాయికి బానిస అవడమే గాక, దాని అమ్మకాలు సాగిస్తున్న వ్యక్తిని వన్ టౌన్ సీఐ మల్లికార్జునరావు శనివారం అదుపులోకి తీసుకున్నారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఇస్లాంపేటకు చెందిన షేక్ సుల్తాన్ (26) కొంతకాలంగా గంజాయికి బానిసగా మారాడు. ఆదాయం కోసం గంజాయిని చిన్న మొత్తంలో ప్యాకెట్లుగా చేసి అమ్మకాలు ప్రారంభించాడు. నిందితుడు ముత్తింశెట్టిపాలెంలో శనివారం గంజాయి విక్రయించేందుకు నిలబడి ఉండగా, అతనిపై అనుమానం వచ్చిన పోలీసులు తనిఖీ చేశారు. అతని వద్ద 300 గ్రాముల గంజాయి లభించింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

పెదకాకాని, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నంబూరు గ్రామంలో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం నంబూరు గ్రామానికి చెందిన షేక్ మల్లిక (29) అదే గ్రామానికి చెందిన సెంట్రింగ్ మేస్త్రి కారుమూరి ప్రేమ్‌కుమార్‌ను ద్వితీయ వివాహం చేసుకుంది. అప్పటి నుంచి నంబూరు గ్రామంలోని విజయభాస్కర్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. శనివారం మధ్యాహ్నం ఆమె ఒక్కరే ఇంట్లో ఉన్న సమయంలో మృతి చెందింది. మృతురాలి మెడపై గాయాలున్నట్లు పోలీసులు గుర్తించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ నారాయణస్వామి పేర్కొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహకాలు పెంచిన ఘనత కూటమిదే

● శాప్ చైర్మన్ రవినాయుడు



బహుమతులు అందజేస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

తాడేపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు ప్రోత్సాహకాలు భారీగా పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదేననీ, ఏపీని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. శనివారం పెనుమాక జడ్పీ హైస్కూల్‌లో 68వ త్రోబాల్ అండర్ -17 బాలబాలికల అంతర్ జిల్లాల ఛాంపియన్‌షిప్ పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి రవినాయుడు ప్రారంభించారు. 13 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. రవినాయుడు మాట్లాడుతూ దేశంలోనే అత్యుత్తమంగా ఏపీ స్పోర్ట్స్ పాలసీని రూపొందించామన్నారు. ఏషియన్, ఖేలో నేషనల్స్ పోటీల్లో రాణించిన క్రీడాకారులకు రూ.3 లక్షల ప్రోత్సాహకం, నేషనల్స్‌లో రాణించిన వారికి ఉద్యోగాల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కల్పించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు. ప్రతి నియోజకవర్గంలో క్రీడా వికాస కేంద్రాలు స్కూలు స్థాయి నుంచి క్రీడాకారులను తయారు చేయాలనేది విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ సంకల్పమన్నారు. ఏపీ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలనేది సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఆశయమనీ, దానికి అనుగుణంగా క్రీడాకారులు క్రీడల్లో రాణించి ప్రపంచ వ్యాప్తంగా దేశ, రాష్ట్ర కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపజేయాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అమరా సుబ్బారావు, కొల్లి శేషు, తెలుగు రైతు గుంటూరు పార్లమెంట్ అధ్యక్షుడు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు జంగాల వెంకటేష్, టీడీపీ మండల అధ్యక్షుడు పాలెపు వీరేంద్రనాథ్, తాడేపల్లి మండల మహిళా అధ్యక్షురాలు బొర్రా కృష్ణవందన, కొల్లి సురేష్, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్ష, కార్యదర్శులు రావూరి రమేష్‌బాబు, సుకుమార్‌రెడ్డి, గాదె వినయ్, లీలాకృష్ణ, డిప్యూటీ డీఈవో శాంతికుమారి, పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు కరిముల్లా, స్కూల్ గేమ్స్ అసిస్టెంట్ సెక్రటరీ నాని, పెనుమాక జడ్పీ హైస్కూల్, హెచ్ఎం పూర్ణచంద్రశేఖర్‌రావు, ఎస్ఎంసీ చైర్మన్ టి. కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, జానకీదేవి తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల లోపాలపై సమగ్ర విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ

పొన్నూరు టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతులకు సంబంధించి రెవెన్యూ రికార్డులలో ఉన్న లోపాలను సరిచేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ తెలిపారు. 'ఆంధ్రజ్యోతి' పత్రికలో వచ్చిన కథనం నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ శనివారం పొన్నూరు తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ రెవెన్యూ రికార్డులో రైతుల పేర్లు ఉండాల్సిన స్థానంలో ఇతరుల పేర్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. అయితే, గతంలో పనిచేసిన అధికారులు ఆ వివరాలను నమోదు చేసినట్లు చెప్పారు. ఈ వివరాలను సరిచేసేందుకు ఐదుగురు సభ్యులతో కూడిన ఐదు రెవెన్యూ బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ బృందం రైతుల వద్దకు వెళ్లి ఆ సర్వే నంబర్‌లో ఉన్న రైతుల వివరాలను సర్వే చేయడంతోపాటు పూర్తి వివరాలను సేకరించి, అర్హులైన రైతుల వివరాలను రికార్డులలో నమోదు చేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ భూమి ఉంటే ప్రభుత్వం అని, దేవాదాయ శాఖ భూమి ఉంటే దేవాదాయ శాఖ భూమి అని రికార్డులను సరి చేయనున్నట్లు చెప్పారు. రైతులు కూడా తమ వివరాలను సర్వే అధికారులకు అందజేయాలని అన్నారు. పూర్తి విచారణ జరిపి రికార్డులలో లోపాలు సరిచేసేందుకు జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ జియావుల్ హక్, డిప్యూటీ తహసీల్దార్ రాజా రమేష్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గింది.. తప్పులున్నాయి

(5వ పేజీ తరువాయి)

సదస్సులు నిర్వహించారు. భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోరుతూ ఇప్పటికీ 12,347 అర్జీలు రాగా వాటిల్లో ఇప్పటివరకు 976 పరిష్కారమయ్యాయి. పల్నాడు జిల్లాలో 366 రెవెన్యూ గ్రామాలు ఉండగా ఇప్పటికి 301 గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. 18,403 మంది సదస్సులకు హాజరై 4,153 అర్జీలు అందజేశారు. వీటిలో ఇప్పటికి 198 అర్జీలను పరిష్కరించారు. బాపట్ల జిల్లాలో 277 రెవెన్యూ గ్రామాలకు 201 సదస్సులు జరిగాయి. 18,560 మంది హాజరు కాగా 4,771 అర్జీలను అందజేశారు. వీటిలో ఇప్పటికి 589 పరిష్కరించారు. గుంటూరు జిల్లాలో 198 రెవెన్యూ గ్రామాలు ఉండగా 158 గ్రామాల్లో సదస్సులు పూర్తయ్యాయి. 18,345 మంది 3,423 అర్జీలను అందజేయగా 189 అర్జీలను పరిష్కరించారు. స్వీకరించిన అర్జీలను పరిష్కరించేందుకు రెవెన్యూ, భూసర్వే రికార్డుల శాఖల అధికారులు సంయుక్తంగా పరిష్కరించాల్సి ఉంది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అర్జీదారుల సమక్షంలోనే భూ సమస్యలను పరిష్కరించాలి. అయితే అధికార యంత్రాంగం అర్జీల పరిష్కారంలో గతంలో వలే వ్యవహరిస్తుందన్న విమర్శలున్నాయి. చిత్తశుద్ధితో అర్జీలను పరిష్కరించకుంటే ప్రభుత్వం ఎంతో ఉన్నతాశయంతో ప్రవేశ పెట్టిన రెవెన్యూ సదస్సుల ఉద్దేశం నీరుగారి పోతుందని చెప్పవచ్చు.

జగన్ అవినీతి వల్లే విద్యుత్ భారాలు

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



సత్తెనపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జగన్ అవినీతి వలనే రాష్ట్రంలో విద్యుత్ భారాలు అని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్ జగన్ అధికారంలో ఉన్నప్పుడు పదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచారన్నారు. అప్పుడు పెంచిన చార్జీలే ఇప్పుడు అమలవుతున్నాయన్నారు. చార్జీలను తానే పెంచి ఇప్పుడు వాటికి వ్యతిరేకంగా ధర్నాకు దిగటం సిగ్గు చేటన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో విద్యుత్ యూనిట్ రూ.4.70 కొంటే వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.7.61 కొన్నాడన్నారు. ఆ భారాన్ని ఇప్పటి వరకు జనం మోస్తూనే ఉన్నారన్నారు. ఐదేళ్ల అరాచక పాలనతో విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేసిన జగన్ ఇప్పుడు విద్యుత్ రంగం కోసం ధర్నాకు పిలుపు ఇవ్వటంపై జనం నవ్వుకుంటున్నారన్నారు. విద్యుత్ చార్జీల పెంపు పాపం జగన్‌దేనన్నారు. విద్యుత్ చార్జీల భారం రూ. 32,166 కోట్లు కాగా విద్యుత్ సంస్థలపై పెరిగిన అప్పులు రూ. 49,596 కోట్లు అన్నారు. అప్పులపై వడ్డీ భారం రూ.10,892 కోట్లు అన్నారు.

నిరసనలు చేయడం విడ్డూరం

● ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులందరికీ వైసీపీ పాలనలోనే విద్యుత్ కష్టాలు మొదలయ్యాయని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ రంగంపై రూ. లక్ష 30 వేల కోట్లకు పైగా భారాన్ని మోపిన మాజీ సీఎం జగన్‌రెడ్డి వినియోగదారులపై ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రతి నెలా అదనపు వసూలు చేశారని వివరించారు. ఇప్పుడు నిరసనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రూ.49.596 కోట్లు అప్పులు పెరిగాయని, విద్యుత్ వినియోగదారులపై రూ. 32.166 కోట్ల అదనపు భారం పడిందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ. 32 వేల కోట్ల అదనపు భారం మోపారని అన్నారు. జెన్‌కో విద్యుత్ ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తి తగ్గిపోవడానికి విజయసాయిరెడ్డి సరఫరా చేసిన నాసిరకం బొగ్గే ప్రధాన కారణమని అన్నారు. వైసీపీ పాలనలో పెరిగిన విద్యుత్ చార్జీలకు అప్పట్లో రాష్ట్ర ప్రజలు మొత్తం రోడ్లపైకి వచ్చి నిరసనలు చేశారని, ఇప్పుడు వైసీపీ నేతలు రాజకీయం చేసేందుకే నిరసన బాట పట్టారని అన్నారు. ప్రజలపై చంద్రబాబు ప్రభుత్వం అదనపు భారం మోపడం లేదన్నారు. జగన్ ఎన్ని డ్రామాలు ఆడినా, ఎన్ని నిరసనలు చేపట్టినా ప్రజల మద్దతు ఉండబోదని ఎమ్మెల్యే యరపతినేని స్పష్టం చేశారు.

ఆర్‌వీఆర్ జేసీలో ముగిసిన 'కొలరిడో ఫెస్ట్'



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్

గుంటూరు (విద్య)డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో "కొలరిడో-2024" పేరుతో గత రెండు రోజులుగా జరుగుతున్న టెక్నికల్, సాంస్కృతికం, క్రీడలు శనివారం ముగిశాయి. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు ఎంపిక చేశారు. అతిథుల చేతుల మీదుగా మొత్తం రూ. 5 లక్షల ప్రోత్సాహక నగదు బహుమతులు, మెమెంటో, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ, కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్, కె. మద్దినేని మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచనల ప్రేరణకు ఇటువంటి పోటీలు, సాంకేతిక ప్రదర్శనలు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్‌వీ శ్రీనివాసరావు, కల్చరల్ కమిటీ ఇన్‌చార్జ్ కన్వీనర్ రంగరాయ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కారు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

● ప్రాణాలతో బయటపడ్డ విద్యార్థి
● మృతుల్లో ఒకరు ఎస్‌బీఐ మేనేజర్, మరొకరు సనత్‌నగర్‌వాసిగా గుర్తింపు
● కళాశాలలో కుమారుడిని వదిలిపెట్టేందుకు వస్తుండగా ఘటన



మృతుడు రషీద్ (ఫైల్)



ప్రమాదం నుంచి బయటపడ్డ విద్యార్థి షకీల్ హసన్

పెనమలూరు, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): కుమారుడిని తాడిగడప వందడుగుల రోడ్డులోని ఒక ప్రైవేటు జూనియర్ కళాశాలలో వదిలిపెట్టేందుకు కారులో బయలుదేరిన ఎస్‌బీఐ మేనేజర్ అకస్మాత్తుగా అడ్డొచ్చిన ఆవును తప్పించబోయి ఆవును, వందడుగుల రోడ్డును దాటుతున్న మరో వ్యక్తి స్కూటీని ఢీకొన్నారు. అనంతరం కారు అదుపు తప్పి కాల్వలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎస్‌బీఐ మేనేజర్‌తో పాటు స్కూటీపై వెళ్తున్న వ్యక్తి మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. కారులో ఉన్న విద్యార్థి ప్రాణాలతో బయటపడ్డాడు. శనివారం ఉదయం స్థానిక పంట కాల్వ రోడ్డులోని కొత్త వంతెన దిగువన జరిగిన ఈ ప్రమాదం స్థానికులను కలచివేసింది. పోలీసులు తెలిపిన వివరాలు... గుంటూరులోని ఎస్‌బీఐలో మేనేజరుగా పనిచేస్తున్న రషీద్(50) నరసరావుపేటలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న భార్యతో కలిసి పటమట పండరీపురంలో నివాసముంటున్నారు. కుమారుడు షకీర్ హసన్ రషీద్ చదువుతున్న కళాశాలకు దగ్గర్లో ఉంటూ ఇంటి వద్ద నుంచి రోజూ కుమారుడిని వందడుగుల రోడ్డులోని ఒక జూనియర్ కళాశాల వద్ద తండ్రి రషీద్ వదిలిపెట్టి గుంటూరు వెళ్తుండేవారు. ఈ క్రమంలో శనివారం ఉదయం కుమారుడిని కళాశాల వద్ద వదిలిపెట్టేందుకు కారులో వందడుగుల రోడ్డు వైపు రషీద్ బయలుదేరారు. పంట కాల్వ రోడ్డులోని సిద్ధార్థ వంతెన దిగువకు వెళుతుండగా, దారిలో అకస్మాత్తుగా కారుకు అడ్డంగా ఒక ఆవు వచ్చింది. వెంటనే రషీద్ ఆవును తప్పించే క్రమంలో ఆవును, అదే రోడ్డులో వందడుగుల రోడ్డు దాటేందుకు స్కూటీపై వెళుతున్న సనత్‌నగర్‌కు చెందిన షేక్ రహీం(58)ను ఢీకొన్నారు. ఈ క్రమంలో అదుపుతప్పిన కారు పక్కనే ఉన్న కాల్వలో పడిపోయింది. కారులో ఇరుక్కున్న రషీద్‌కు, కారు ఢీకొని షేక్ రహీంకు బలమైన గాయాలు అయ్యాయి. రషీద్, రహీంలను ట్రాఫిక్ సీఐ వెంకట్ నేతృత్వంలో సిబ్బంది దగ్గర్లోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వారు అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. రషీద్ కుమారుడు షకీర్ హసన్‌కు స్వల్పగాయాలయ్యాయి. కారు బలంగా ఢీకొనడంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. అప్రమత్తమైన ట్రాఫిక్ పోలీసులు, పెనమలూరు పోలీసులు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా నియంత్రించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ ఐదేళ్లలో పదిసార్లు విద్యుత్ చార్జీలు పెరిగాయి

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న గూడపాటి శ్రీనివాసరావు

రేపల్లె, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ.32 కోట్ల భారాన్ని జగన్‌రెడ్డి మోపారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఉప్పూడిరోడ్డులోని టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచారంటూ వైసీపీ నాయకులు ధర్నాలు నిర్వహించటం వారి పరాకాష్టకు నిదర్శనమన్నారు. ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా కల్పించకుండా బుద్ధి చెప్పినా వైసీపీ నాయకుల్లో ఇంకా మార్పు రాలేదని అన్నారు. పదిసార్లు విద్యుత్ చార్జీలను పెంచిన జగన్‌రెడ్డి విద్యుత్ చార్జీల విషయం మాట్లాడటం సిగ్గుచేటన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని జగన్‌రెడ్డి పాలనలో సోలార్‌ప్లాంట్లపై దాడి చేసి ధ్వంసం చేశారని, చట్ట విరుద్ధంగా పీపీఏలను రద్దు చేయడం వలన ఏడు వేల మెగావాట్లు తక్కువ రేట్లకు వచ్చే విద్యుత్ ఉత్పత్తి కోల్పోయినట్లు వివరించారు. దీనివలన రాయలసీమ, ప్రకాశం జిల్లాలో యువతకు ఉద్యోగాలు రావటమే కాకుండా మిగులు విద్యుత్ రాష్ట్రంలో ఉండేదని, ఇతర రాష్ట్రాలకు అమ్ముకుని లాభపడి ఉండేదని అన్నారు. వైసీపీ పాలనలో విద్యుత్ సంస్థలపై రూ.49 వేల కోట్లకుపైగా అప్పు చేసినా ఒక్క కొత్త విద్యుత్ ప్లాంట్‌ను నిర్మించలేదన్నారు. సెకి ఒప్పందం వల్ల విద్యుత్ సంస్థలకు ఏడాదికి రూ.3,800 కోట్లు మొత్తం 30 ఏళ్లకు రూ.లక్ష కోట్లు వినియోగదారులపై జగన్ భారాలు మోపారన్నారు. జగనే విద్యుత్ చార్జీలు పెంచి ఆయనే ధర్నాలు చేయడం ప్రజలను మోసగించటమేనన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్, జీవీ నాగేశ్వరరావు, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, జీపీ రామారావు, డి.సంగీతరావు, జి. రామారావు, దేవగిరి రవి, బొర్రా సూర్యరాజు, నల్లూరి అజయ్‌కుమార్, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, వి.సాయిగోపి, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 573.10 అడుగులు ఉంది. ఇది 264.36 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7778 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8193 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 27,846 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 46,517 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 29,100 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శనివారం 40.18 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.65 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	113,121,132
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

రేపటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

గుంటూరు (తూర్పు) డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన ఏక కమిషన్ సభ్యుడు రాజీవ్ రంజన్ మిశ్రా సోమవారం నగరానికి రానున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. కమిషన్ సభ్యుడితో జిల్లా అధికారులతో సమావేశం, అనంతరం షెడ్యూల్డ్ కుల సంఘాల ప్రతినిధుల నుంచి వినతులు, అభిప్రాయాలు స్వీకరించే కార్యక్రమం ఉన్న కారణంగా పీజీఆర్ఎస్‌ను రద్దు చేసినట్లు తెలిపారు. మండల స్థాయిలో ఈ కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని తెలిపారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపునకు ప్రత్యేక కౌంటర్లు

గుంటూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): నెలాఖరు నేపథ్యంలో వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించేలా అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు ఆదివారం కూడా అందుబాటులో ఉంటాయని గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఇన్‌చార్జి ఎస్ఈ కేవీఎల్ఎల్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. స్మార్ట్ ఫోన్‌లలో డిజిటల్ పేమెంట్లు చేయవచ్చని కోరారు.

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన తేదీల ఖరారు

గుంటూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో అప్రెంటిస్ షిప్ కోసం నవంబరు 6వ తేదీ నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఐటీఐ అభ్యర్థుల విద్యార్హత ధ్రువపత్రాల పరిశీలన తేదీలను ఖరారు చేసినట్లు ఏపీఎస్ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాల-విజయవాడ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, మాజీ సైనికోద్యోగుల పిల్లల ఎవరైనా ఉంటే ఈ నెల 31న హాజరుకవాలని కోరారు. మోటార్ మెకానిక్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మాన్ సివిల్, వెల్డర్, పెయింటర్, మెషినిస్ట్ ట్రేడ్స్ వారు జనవరి 2న, ఎలక్ట్రీషియన్ ట్రేడ్ జనవరి 3న, డీజిల్ మెకానిక్ ట్రేడ్ జనవరి 4వ తేదీ నుంచి జనవరి 6 వరకు విజయవాడ, విద్యాధరపురం, చెరువు సెంటర్‌లోని జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాలలో ఉదయం పది గంటలకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 7382900591, 7282900299, 7989790054, 8309089998 నంబర్లలో సంప్రదించాలని జిల్లా ప్రజా రవాణాధికారి కోరారు.

సివిల్ సర్వీసెస్‌పై పుస్తకావిష్కరణ

గుంటూరు (విద్య) డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్‌పై ప్రాథమిక అవగాహన అవసరమని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. యూటీఎఫ్ హాలులో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో సివిల్ సర్వీసెస్‌పై రూపొందించిన పుస్తకాన్ని లక్ష్మణరావు ఆవిష్కరించారు.

నామినేటెడ్ పోస్ట్ ఇప్పిస్తానని మోసం

గుంటూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బృందావన్ గార్డెన్స్ మూడో లైన్‌కి చెందిన మహిళ బీ ఉదయలక్ష్మి కి వ్యవసాయ శాఖలో నామినేటెడ్ పోస్ట్ ఇప్పిస్తామని చెప్పి మోసం చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. గతంలో తనకు పరిచయం ఉన్న వనజ అనే మహిళ ద్వారా ఆమె భర్త క్రాపా విజయ కుమార్, అదేవిధంగా వనజ, ఆమె తల్లి, ముద్దన రామాంజనేయ స్వామి తో పాటు శ్రీకాంత్‌రెడ్డి అనే వ్యక్తులు ఉదయలక్ష్మి వద్ద రూ.14 లక్షలు తీసుకొని మోసం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో బాలికను ట్రాప్ చేసిన యువకుడు

గుంటూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అరండల్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలికను ప్రేమ పేరుతో ఓ యువకుడు ట్రాప్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి నిందితుడైన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ప్రేమ పేరుతో తనను మోసగించి, ప్రసవించడానికి కారణమైన ఆ యువకుడిపై బాధితురాలు ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేశారు.

బంగారపు షాపు నిర్వాహకుడికి బురిడీ

● చెవిటి, మూగవాడినని చెప్పి అపహరణ

గుంటూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దపులి సందులో గల ఓ బంగారు షాప్ నిర్వాహకుడిని యువకుడు బురిడీ కొట్టించాడు. రెప్పపాటులో దుకాణ యజమాని దృష్టి మరల్చి 208 గ్రాముల బంగారు ఆభరణాలతో ఉడాయించాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు.. పెద్దపులి సందుకు చెందిన రియాజుద్దీన్ నిజాం జ్యువెలర్స్ పేరుతో బంగారు దుకాణం నిర్వహిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో యువకుడు షాపులోకి వచ్చాడు. తన చేతిలో ఉన్న పత్రాన్ని దుకాణ యజమాని రియాజుద్దీన్‌కు అందించాడు. తాను చెవిటి, మూగవాడినని తమ వంతు ఆర్థిక సహాయం అందించాలంటూ రియాజుద్దీన్ కు ఇచ్చిన పత్రంలో కోరారు. షాపు నిర్వాహకుడు ఆ పత్రాన్ని పరిశీలిస్తుండగా నిందితుడు తన రెండో చేతిలో ఉన్న పత్రాలను టేబుల్‌పై బంగారు ఆభరణాలు కలిగిన బాక్స్ పై పెట్టాడు. ఆ తర్వాత నిర్వాహకుడు ఇచ్చిన పత్రాన్ని తీసుకొని వెళ్తూ టేబుల్ పై ఉన్న ఆ బాక్సును కూడా తీసుకువెళ్ళాడు. కొన్ని నిమిషాల తర్వాత టేబుల్ పై ఉండాల్సిన బాక్స్ కనిపించకపోవడంతో యజమాని కంగారుపడ్డాడు. వెంటనే సీసీ కెమెరా పుటేజ్‌ను పరిశీలించగా ఈ చోరీకి పాల్పడింది ఆ యువకుడేనని తెలిసింది. రియాజుద్దీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నైపుణ్యం కలిగిన వారికే ప్రాధాన్యం



విద్యార్థినులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న న్యాయ నిర్ణేతలు, ప్రిన్సిపాల్

వట్టిచెరుకూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సీ రంగాల్లో నైపుణ్యం కలిగిన విద్యార్థులకే ఇండస్ట్రీస్ అవకాశం కల్పిస్తున్నాయని రాజేష్ సుంకవల్లి, రోహిత, రవితేజ వివరించారు. మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజనీరింగ్ కళా శాలలో శనివారం ఏఐ అండ్ ఐవోటీ 36 గంటల హాసిక తోన్ కార్యక్రమం ముగిసింది. కార్యక్రమంలో మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ చదువుతున్న 150 మంది ఈసీఈ విభాగానికి చెందిన విద్యార్థినులు 28 బ్యాచ్‌లుగా పోటీపడ్డారు. ఈ కార్యక్రమానికి మేక్ స్కిల్డ్ నుంచి మెంటార్స్‌గా వ్యవహరించారు. న్యాయ నిర్ణేతలుగా హెడ్‌డబ్ల్యూఏఎఫ్ యూ టెక్నాలజీ ఐఎస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో రోహిత్ రవితేజ, హైదరాబాద్ ఇన్ఫోసిస్ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ రాజేష్ సుంకవల్లిలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి ప్రస్తుతం ప్రతి ఇండస్ట్రీ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో నైపుణ్యం కలిగిన విద్యార్థులకు అవకాశాలు కల్పిస్తున్నారని వారు గుర్తుచేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జెట్టి అప్పారావు, విభాగాధిపతి డీ విజయసారధి, అధ్యాపకులు, అధ్యాపకేతరులు పాల్గొన్నారు.

'గోల్డెన్ అవర్' ఎంతో కీలకం: కలెక్టర్



కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, కమిషనర్

గుంటూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదం జరిగిన తొలి అరవై నిమిషాల సమయం (గోల్డెన్ అవర్) ఎంతో కీలకమని, ఆ సమయంలో క్షతగాత్రులకు అందించే ప్రథమ చికిత్సే వారి ప్రాణాలను కాపాడతాయని, ఆ సమయంలో సమీప ప్రైవేట్ ఆసుపత్రిలోనూ కేంద్ర ప్రభుత్వ బీమా పథకం ద్వారా రూ. 30,000 వరకు నగదు రహిత వైద్యసేవలు తక్షణమే అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశంలో కలెక్టర్‌తో పాటు ఎస్పీ సతీష్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు పాల్గొన్నారు. సమావేశంలో డీటీసీ కే సీతారామిరెడ్డి, ఎంటీఎంసీ కమిషనర్ ఆలీమ్ బాషా, జాతీయ రహదారులు పీడీ టీపార్వతీశం, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూదనరావు, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కే విజయలక్ష్మి, ఏపీఎస్ఆర్టీసీ రీజనల్ మేనేజర్ రవి కాంత్, గుంటూరు ఆర్డీవో ప్రసాదు, తెనాలి ఆర్డీవో శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సామర్థ్యానికి వయసుతో పనిలేదని, రిటైర్మెంటు ఉండదని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో శనివారం ఆంధ్రప్రదేశ్ 6వ మాస్టర్స్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీలను గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత పరుగు పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. 92 ఏళ్ల వయస్సు కలిగిన ఓ వృద్ధుడు, వృద్ధురాలు పోటీలలో పాల్గొనడం చూసి ఆశ్చర్యానికి గురైన ఆమె, అలాంటివారిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సత్కరించారు.వయస్సు పైబడినా క్రీడల్లో ఉత్సాహంగా వారు పాల్గొనడం హర్షణీయమన్నారు. సీనియర్ సిటిజన్లు హై జంప్, లాంగ్ జంప్ పోటీల్లో పాల్గొన్న వారిని చూసి యువత స్ఫూర్తి పొందాలన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు పాపం జగన్‌దే: ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపు భారం జగన్‌దేనని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఆరోపించారు. గుంటూరులోని తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ పాలనలో జగన్ అవినీతి వల్లే విద్యుత్‌చార్జీల భారం నేడు సామాన్య ప్రజలపై పడిందని అన్నారు. విద్యుత్ చార్జీల పెంపునకు కారణమైన జగన్ నేడు ధర్నాలతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు

గత ఐదేళ్లలో విద్యుత్‌రంగం అస్తవ్యస్తం: తెనాలి శ్రావణ్‌కుమార్



మాట్లాడుతున్న తెనాలి శ్రావణ్‌కుమార్, పక్కన రాజా మాస్టారు తదితరులు

గుంటూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో విద్యుత్ రంగం అస్తవ్యస్తంగా తయారైందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ చార్జీలపై రాష్ట్ర వ్యాప్తంగా గత రెండు రోజులుగా దుష్ప్రచారం జరుగుతోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వంద రోజుల వ్యవధిలో విద్యుత్ కోతలేని రాష్ట్రంగా తీర్చిదిద్దిన సంగతి ప్రజలకు తెలిసిందేనన్నారు. అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజా మాస్టర్ మాట్లాడుతూ 2014లో చంద్రబాబు చేసిన పీపీఏలను రద్దు చేసి కమీషన్ల కోసం కొత్త ఒప్పందాలు చేసుకుని, విద్యుత్ చార్జీలు పెంచి, ప్రజలపై భారం మోపిన జగన్ తగుదునమ్మ అంటూ ఆందోళనకు దిగడం సిగ్గుచేటన్నారు. 2014 నుంచి 19 వరకు నాణ్యమైన విద్యుత్ ఇవ్వగా ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రజలను వంచించిందని విమర్శించారు.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న మేయర్ , ఎమ్మెల్యే తదితరులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): నీతి నిజా యితీ లతో పదేళ్ల పాటు దేశ ప్రధానిగా, ఆర్థిక మంత్రిగా భారత దేశ ఆర్థికావృద్ధికి విశేష కృషి చేసిన డాక్టర్ మన్మోహన్ సింగ్‌కి భారతరత్న పురస్కారాన్ని కేంద్ర ప్రభుత్వం అందించాలని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు కోరారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు అధ్యక్షతన శనివారం మన్మోహన్ సింగ్ సంతాప సభ నిర్వహించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్, కార్పొరేటర్లు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యం



ఆహార ఉత్పత్తులను పరిశీలిస్తున్న డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి,డీపీఎం రాజకుమారి

గుంటూరు సిటీ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలను లక్షాధికారులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని డీఆర్డీఏ పీడీ విజయ లక్ష్మి అన్నారు. స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో శనివారం స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఆహార ఉత్పత్తుల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లో ని మహిళా అభ్యున్నతికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. మహిళలను ఆర్థికంగా పైకి తెచ్చేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ప్రదర్శన లో 17 మండలాల నుంచి 173 మంది స్వయం సహాయక సంఘం మహిళా ఆహార ఉత్పత్తి దారులు పాల్గొన్నారు. వారు తయారు చేసిన ఆహార ఉత్పత్తులను ప్రదర్శన లో ఉంచారు.

భూముల మార్కెట్ ధరల పెంపు నిర్ణయం ఉపసంహరించుకోవాలి

గుంటూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూముల మార్కెట్ ధరలు జనవరి ఒకటి నుంచి పెంచాలన్న నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉప సంహరించుకోవాలని అపార్ట్‌మెంట్స్ ఫ్లాట్స్ ఓనర్స్ సంఘం నాయకులు ఆర్ వెంకటరత్నం కోరారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో భూముల మార్కెట్ విలువ పెంపును నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ సమావేశం జరిగింది.

ట్రాఫిక్ నిబంధనలపై ఆటో డ్రైవర్లు అవగాహన పెంచుకోవాలి

● ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. శనివారం స్థానిక పోలీస్ కల్యాణమండపంలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్పీ మాట్లాడుతూ సుమారు 20 వేల ఆటోలు ఉన్న గుంటూరు లో ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించకపోవడం వలన ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. గుంటూరు తూర్పు, పశ్చిమ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధికి సంబంధించి ప్రతి ఒక్క ఆటోకు ఒక ప్రత్యేకమైన నంబర్ కేటా యిస్తామని, ఒక ఆటోకు ఒక నంబర్ మాత్రమే ఇస్తామని, ఆ నంబర్ ద్వారా ఆ ఆటోను ఎక్కడున్నా గుర్తించవచ్చన్నారు. దీనివలన ఆటో వారు ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించకపోయినా, ర్యాష్ డ్రైవింగ్ చేసినా, ఆటోలను ఉపయోగించి ఏవైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, ఎవరైనా దొంగిలించినా సుల భంగా కనిపెట్టవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ఆ క్యూర్ కోడ్ తో ఉన్న వివరాల పట్టికను, ప్రత్యేక నంబర్‌ను తమ ఆటోలకు అంటించుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ సుప్రజ, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ సుబ్బారావు, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్ , వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య పాల్గొన్నారు.

ఎన్టీఆర్ మానస సరోవరం అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

● జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మానససరోవరం పార్క్‌లో జంగిల్ క్లియర్ చేసి, పీపీటీ విధానం ద్వారా ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే కేంద్రంగా అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక జాతీయ రహదారికి చేరువగా ఉన్న గుంటూరు నగర పాలక సంస్థ మానససరోవరం పార్క్ ని శనివారం ఆయన పరిశీలించారు. తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. తొలుత పార్క్ అంతటినీ పరిశీలించి, పార్క్ విస్తీర్ణం, బౌండరీలు, ఉన్న భవనాలు, టాయ్ లెట్స్, కాల్వపై వంతెనలు, బోటింగ్ పాయింట్‌ల ప్రస్తుత స్థితిపై నివేదిక ఇవ్వాలని ఈఈని ఆదేశించారు. పార్క్‌ని సర్వే చేసి, బౌండరీలు ఫిక్స్ చేయాలని సర్వేయర్ ఆదేశించారు. గతంలో నగరంతో పాటు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి కూడా విద్యార్థులు పార్క్ ని చూడడానికి వచ్చేవారన్నారు. పబ్లిక్ ప్రైవేట్ పార్టిసిపేషన్ (పిపిపి) విధానంలో అభివృద్ధి చేయడానికి, సర్వే అనంతరం కాంపౌండ్ వాల్ నిర్మాణం చేయడానికి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఎస్ఈ ని ఆదేశించారు.

విద్యార్థులకు రూ.16 లక్షల ఉపకార వేతనాలు తెనాలిలో నేడు పంపిణీ



తులసీ గ్రూప్స్ ఎండీ తులసీ యోగీష్ చంద్ర

గుంటూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్, గుంటూరు - కృష్ణదేవరాయ ఎడ్యుకేషనల్ ప్రోగ్రెసివ్ అసోసియేషన్ (కేఈపీఏ) తెనాలి వారి సంయుక్త ఆధ్వర్యంలో తెనాలిలో ఆదివారం పేద విద్యార్థులకు రూ. 16 లక్షల ఉపకార వేతనాలను పంపిణీ చేయనున్నారు. ఈ విషయాన్ని తులసీ గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ తులసీ యోగీష్‌చంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 341 మంది పేద విద్యార్థులకు రూ. 16 లక్షలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇందులో రూ. 3 లక్షలు తులసి సీడ్స్ వారు కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్ ద్వారా 60 మంది ప్రతిభ గల పేద విద్యార్థులకు అందిస్తున్నట్లు వివరించారు. తెనాలిలోని తెనాలి రామకృష్ణ కవి కళా క్షేత్రంలో మధ్యాహ్నం రెండు గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమౌతుందన్నారు. ముఖ్య అతిథిగా తులసి గ్రూప్ ఛైర్మన్ తులసి రామచంద్ర ప్రభు హాజరై విద్యార్థులకు ఉపకార వేతనాలను అందించనున్నారు.

ప్రభుత్వాస్పత్రిలో టైం బ్యాంక్ సేవలు!

గుంటూరు మెడికల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో కొత్తగా టైం బ్యాంక్ అనే వినూత్న కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రమణ ఎస్ఎస్‌వీ తెలిపారు. శనివారం తన ఛాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. హిందూ కాలేజ్ ఆఫ్ టైమ్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు చేస్తున్న 16 మంది విద్యార్థులు టైం బ్యాంక్‌లో తమ సేవలు అందించేందుకు పేర్లు నమోదు చేసుకున్నట్లు డాక్టర్ రమణ తెలిపారు. వీరు వివిధ విభాగాల్లో వాలంటరీగా 90 గంటల పాటు తమ సేవలు అందిస్తారని వివరించారు. ఇదేరీతిలో జీజీహెచ్ టైం బ్యాంక్ కార్యక్రమంలో తమ వంతు సేవలు అందించేందుకు ఇతర కళాశాలల నుంచి కూడా పలువురు విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. పేర్లు నమోదు చేయించుకొనే కళాశాల విద్యార్థులు ఏదైనా సందర్భంలో ఆసుపత్రికి సేవలు అందించవచ్చన్నారు. ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో టైం బ్యాంక్‌లో స్వచ్ఛంద సేవలు అందించే విద్యార్థులకు ఆసుపత్రి తరపున సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు.

బహిరంగ ప్రకటన

నాక్లయింట్లు అయిన గుంటూరు జిల్లా, తాడికొండ(మం), గరికపాడు గ్రామం డోర్.నెం:2-40 కాపురస్తులు జాలా సామ్యేలుగారి కుమారుడు జాలా యేషయ్య మరియు గుంటూరు సిటీ, బ్రాడీపేట 2/20వ లైను, డోర్ నెం:28-17-812 జాలా సామ్యేలు గారి కుమారుడు జాలా పాల్ గార్ల సంజాయిషి పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా, షెడ్యూలు ఆస్తి జాలా భూషణం గారి కుమరుడు సామ్యేలు గారు అఖిలాంధ్ర శ్రీ పొట్టి శ్రీరాములు సేవక్ సమాజము గుంటూరు తరపున సెక్రటరీ గారైన బొన్నకూటి శేషయ్య గారి కుమారుడు రాధాకృష్ణమూర్తి గారి వలన క్రయం పొంది గుంటూరు జిల్లా రిజిష్ట్రారు వారిఆఫీసులో 1వపుస్తకం, 1627 వాల్యూం, 302 నుండి 305 పుటల దాఖలా ద.నెం.9645/1983రుగా రిజిష్టరు కాబడిన విక్రయ దస్తావేజు ద్వారా వారికి సంక్రమించిన ఆస్తిలో ఆర్.సి.సి. డాబా ఇల్లు నిర్మించుకొని సర్వ హక్కులతో అనుభవించుచూ సదరాస్తికి సంబంధించి ఎట్టి ఏర్పాట్లు చేయకనే సదరు సామ్యేలు గారు ది.06-06-2014న స్వర్గస్థులైనారు. వీరి భార్య జాలా అన్నమ్మగారు పూర్వమే అనగా ది.02-04-1985న స్వర్గస్థులైరి వారిఇద్దురి మరణానంతరము ముఖ్యవారసులైన నా క్లయింట్లరు సర్వ హక్కులతో సంక్రమించి దరిమిలా వారిరువురు షెడ్యూలాస్తిని రిజిష్టరు పార్టీషన్ దస్తావేజు నెం.6946/2024 ది.19-09-2024(యస్.ఆర్.ఓ.కొరిటెపాడు) ద్వారా పార్టీషన్‌చేసుకొని ఎవరివాటా వారు అనుభవించుచున్నారు. ప్రస్తుతం నా క్లయింట్లు వారి కుటుంబ లాభనిమిత్తం షెడ్యూలాస్తిని కె.వెంకటేశ్వర్లు గారి కుమారుడైన వెంకటరావు గారికి అమ్ముటకు సిద్ధపడినారు. కావున ఎవరికైనా ఎట్టి అభ్యంతరములైన ఉన్నయెడల ఈ రోజు నుండి 7రోజులలోగా ఈ దిగువ అడ్రసు నందు తగు లిఖితపూర్వక ఆధారాలతో సంప్రదించవలెను. గడువులోగా ఎట్టి అభ్యంతరములు రానియెడల నాక్లయింట్లు సదరాస్తిని వెంకటరావు గారికి రిజిష్టరు విక్రయ దస్తావేజు ద్వారా విక్రయించెదరు. గడువు దాటిన పిమ్మట వచ్చు ఎట్టి అభ్యంతరాలైన నాక్లయింట్లను బంధింపజాలవు.

షెడ్యూలు:గుంటూరు డి॥ & సబ్.డి॥, ప్రస్తుతం కొరిటెపాడు సబ్.డి॥, కొరిటెపాడు గ్రామ డి.నెం.229కు సరియగు టి.యస్.నెం.523, పొట్టి శ్రీరాములు నగర్, మునిసిపల్ పాత వార్డు నెం.1, కొత్త వార్డు నెం.2, బ్లాకు నెం.8,ప్లాట్ నెం.17, చ.గ.119.1ల స్థలము(పాతఇంటిని పడవేయగా) డోరు.నెం. 4-16-186 ఆస్తికి హద్దులు.తూర్పు:మునిసిపల్ రోడ్డు,దక్షిణం: మునిసిపల్ రోడ్డు, పడమర: కొప్పుల ఫిలిప్ ఆస్తి, ఉత్తరం: కొప్పుల రాఘవరావుఆస్తి.

గోవిందు సుధామాధురి, అడ్వకేట్
ప్లాటు నెం.201, హనుమాన్ హైట్స్, 3వ లైను అంజనేయ పేట, అమరావతిరోడ్డు, గుంటూరు, సెల్: 94402 60307

శిలలపై.. శిల్పాలు

- దుర్గి శిల్పం.. ఖండాంతర ఖ్యాతి
- 12వ శతాబ్దంలోనే శిల్పకళకు బీజం
- స్వదేశీ శిల్పకళకు ప్రాచుర్యం తెస్తోన్న శిల్పులు


బిడ్డకు పాలిస్తున్న మాతృమూర్తి



కొండ రాళ్లు.. వారి చేతుల్లో పడితే కనువిందు చేసే శిల్పంగా మారుతోంది. చేతివేళ్లు రాయిపై నర్తిస్తూ సుందరంగా మలుస్తాయి. పురాతన కళగా ప్రసిద్ధి చెందిన శిల్పకళకు.. కళాకారులకు దుర్గి కేంద్రంగా ఉంది. ఇక్కడ ప్రభవిస్తున్న శిల్ప కళాఖండాలు ఖండాంతర ఖ్యాతిని ఆర్జిస్తున్నాయి. ఇక్కడ నెలకొల్పిన శిల్ప కళాశాలల నుంచి నిరంతరం శిల్ప కళా ఖండాలు ప్రాణం పోసుకుని విశ్వవ్యాప్తంగా ఎగుమతై స్వదేశ శిల్పకళకు గొప్ప ప్రాచుర్యాన్ని సంపాదించి పెడుతున్నాయి. అంగుళం సైజు నుంచి ఆరడుగుల ఎత్తులో పలు బంగిమలతో రాతి శిల్పాలను చెక్కడంలో దుర్గి శిల్పులు సిద్ధహస్తులు. వన్నె తగ్గిన శిల్ప కళలో కొత్త కాంతిని ప్రవహింపజేయడానికి ఇక్కడ శిల్పులు నిత్యం కృషి సల్పుతూ రాళ్లలో అపురూప కళాఖండాల అన్వేషణ చేస్తున్నారు. మాచర్లలోని ప్రాచీన చెన్నకేశవ, వీర భద్రాలయాలు, అమరావతి, నాగార్జున కొండలో నిర్మించిన బౌద్ధ స్థూపాల నిర్మాణం వెనుక దుర్గి శిల్పుల పాత్ర ఉన్నట్లు కూడా పలువురు విశ్వసిస్తున్నారు.

మాచర్లటౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దుర్గిలో అనాదిగా శిల్పకళ నిత్య నూతనంగా వికసించి పరిమళిస్తూ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ప్రతియేటా దేశ విదేశీ పర్యాటకులు ఇక్కడి శిల్ప సోయగాలను తిలకించి పులకించిపోతుంటారు. దుర్గిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న నాగార్జున శిల్పకళ శిక్షణా కేంద్రంతోపాటు శ్రీ వేంకటేశ్వర శిల్ప కళాశాల, శ్రీ వేణుగోపాలస్వామి, దుర్గాదేవి శిల్ప కళాశాలలున్నాయి. దుర్గి శిల్ప కళాశాలల్లో ప్రాణం పోసుకున్న రాతి విగ్రహాల్లో దేవతామూర్తులే కాక పల్లెపడుచు, శిశువుకు పాలిస్తున్న మాతృమూర్తి, దర్పన సుందరి, వయ్యారాలు వలికించే సుందరాంగులు విగ్రహాలు ప్రధానంగా ఉంటాయి. క్రీస్తు శకం 12వ శతాబ్దంలోనే ఇక్కడ శిల్ప కళకు బీజం పడింది. తొలుత కొందరు శిల్పులు పెందోట నుంచి ద్వారకాపురికి వలస వచ్చి ఇక్కడే స్థిరపడి జీవనం సాగిస్తుండేవారు. మహాయాన బౌద్ధమతాన్ని రూపొందించిన ఆచార్య నాగార్జునుడు పెందోట నివాసి అని కొందరి భావన. 12వ శతాబ్దంలో ప్రకృతి వైపరీత్యమో లేక శత్రురాజుల దాడుల ఫలితమో ద్వారకాపురి పట్టణం పూర్తిగా విధ్వంసమైంది. ఈ క్రమంలో ప్రాణాలతో మిగిలిన ద్వారకాపురి ప్రజలు కొందరు దారివేముల అనే ప్రాంతానికి తరలివచ్చి గ్రామాన్ని నిర్మించుకున్నారు. ద్వారకాపురికి చెందిన కొందరు శిల్పులు నేటి దుర్గి ప్రాంతానికి వచ్చి స్థిరపడ్డారు. వారు ఈ ప్రాంతానికి వచ్చిన వెంటనే శత్రుక్షయం కోరుతూ దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠాపన చేసి తాము నివసిస్తున్న ప్రదేశానికి దుర్గాదేవి పేరిట దుర్గి అని నామకరణం చేశారు. ఇదంతా యదార్థం అనేందుకు నిదర్శనంగా దుర్గిలో నేటికీ ప్రాచీన దుర్గాదేవి ఆలయం ఉండడం గమనార్హం. దుర్గిలో 15వ శతాబ్దం నాటికి శిల్పుల కుటుంబాల సంఖ్య 300కు చేరినట్లు కొందరి అభిప్రాయం. ఇక్కడ కాకతీయుల కాలంలో క్రీ.శ.1127లో నాగేశ్వర, ఓంకారేశ్వర ఆలయాలు, క్రీ.శ.1160లో వేణుగోపాలస్వామి, క్రీ.శ.1140లో వీరభద్రస్వామి ఆలయాలు స్థానిక శిల్పులచే నిర్మించినట్లు ఆయా శిలా శాసనాలు స్పష్టం చేస్తున్నాయి.


బుద్ధుడు

కళాభివృద్ధికి ప్రభుత్వ తోడ్పాటు

కాలక్రమంలో శిల్ప కళా పోషకులు కరువై అన్ని చోట్ల క్షీణదశకు చేరింది. రాజులు, రాజ్యాలు అంతరించడంతో శిల్ప కళకు ఈ దుస్థితి దాపురించింది. దీంతో ఎందరో శిల్పులు వృత్తికి స్వస్తిచెప్పి ఇతర వృత్తులను ఆశ్రయించారు. మిగిలిన కొద్దిమంది శిల్పులు మాత్రం వంశపారంపర్యంగా పుణికిపుచ్చుకున్న శిల్పకళను త్యజించలేక శిలలకు ప్రాణంపోసి జీవనయాత్ర సాగిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కళను రక్షించి శిల్పుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం 1962లో దుర్గిలో శిల్ప కళా శిక్షణా కేంద్రాన్ని నెలకొల్పింది. పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ శిక్షణా కేంద్రంలో మొదటి రెండేళ్లలో ఆరుగురు మాత్రమే శిక్షణ పొందారు. ఆ తర్వాత వందల సంఖ్యలో శిక్షణ పొంది నైపుణ్యం సాధించారు. వీరిలో ఎంతో మంది ఇతర జిల్లాల్లో శిల్ప కళాక్షేత్రాలను నెలకొల్పి శిల్ప కళాభివృద్ధికి తోడ్పడుతున్నారు. శిల్పతయారీలో సూచనలు, సలహాలకి నాగార్జున స్టోన్ క్వారింగ్ వర్కర్స్ కో-ఆపరేటివ్ ఇండస్ట్రియల్ సొసైటీని ఏర్పాటు చేశారు. 1963లో రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఇక్కడ శిల్ప కళాకారుల కేంద్రాన్ని నిర్మించింది. శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఇచ్చే స్టైఫండ్‌ను రూ.100కు పెంచారు. శిల్పులు వృత్తి నైపుణ్యత సాధించడానికి రీజనల్ డిజైన్ అండ్ టెక్నికల్ డెవలప్‌మెంట్ సెంటర్ (బెంగళూరు) ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహిస్తోంది.


రాధాకృష్ణులు

శిల్పులకు సముచిత సత్కారం

దుర్గి శిల్పాలు సందర్శకులను ఇట్టే కట్టిపడేస్తాయి. 1984లో హైదరాబాద్‌లో వినాయక చవితి సందర్భంగా 'విఘ్నేశ్వర విగ్రహ ప్రదర్శన'లో దుర్గి విగ్రహాలను తిలకించి ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు మంత్రముగ్ధులయ్యారు. ఆ తర్వాత కొద్ది కాలానికే ఆయన దుర్గి శిల్ప కళాకేంద్రాన్ని సందర్శించారు. ఎన్టీఆర్‌కు ముందు మాజీ ముఖ్యమంత్రి అంజయ్య కూడా దుర్గి శిల్పుల కళాసేవకు గుర్తుగా శిల్పకళాకేంద్రం ప్రధానాచార్యులు ఈశ్వర భిక్షమాచారిని సత్కరించారు. 1996లో 'స్టోనా 96' పేరిట బెంగళూరులో నిర్వహించిన ప్రపంచ శిల్ప విగ్రహ ప్రదర్శనలో పాల్గొనాలని దుర్గి శిల్పకళాకేంద్రానికి కేంద్ర ప్రభుత్వం నుంచి పిలుపురావడం గొప్ప విశేషం. గతంలో తెలంగాణ ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ కూడా దుర్గి శిల్పుల శిల్పకళా ప్రావిణ్యానికి సంబరపడి శిల్పి చెన్నుపాటి శ్రీనివాసాచారిని సన్మానించారు.


శిల్పానికి మెరుగులు దిద్దుతున్న శ్రీనివాసాచారి


తెలుగు తల్లి

సింగరయ్య స్వామి కొండను కాపాడాలి

- అక్రమ క్వారీయింగ్‌పై గ్రామస్థుల ఆందోళన
- ఎండోమెంట్, మైనింగ్ అధికారులకు అల్టిమేటం


సింగరయ్య స్వామి కొండ వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న పేరేచర్ల గ్రామస్థులు

మేడికొండూరు డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన పేరేచర్ల సమీపంలోని సింగరయ్య స్వామి కొండను కాపాడాలని పేరేచర్ల గ్రామస్థులు డిమాండ్ చేశారు. శ్రీలక్ష్మీనరసింహ స్వామిగా కొండపై రాతి రూపంలో పూజలందుకుంటున్న సింగరయ్య స్వామి కొండ వద్ద అక్రమ క్వారీయింగ్ వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ పేరేచర్ల గ్రామస్థులు శనివారం కొండ దిగువ భాగంలో ఆందోళన చేపట్టారు. కొండ ప్రాంతంలో అక్రమ క్వారీయింగ్‌ను పరిశీలించిన గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కొండ చుట్టూ ఇష్టారాజ్యంగా క్వారీయింగ్ చేస్తూ సింగరయ్య స్వామి విగ్రహం సమీపం వరకు క్వారీయింగ్ చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. ఇప్పటికే కొండపైన ఎంతో పవిత్రంగా భావించే జలపాత కొలను ధ్వంసం చేశారని, ఇదే పరిస్థితి కొనసాగితే స్వామి విగ్రహం ప్రమాదంలో పడే అవకాశముందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా ఏకాదశి నాడు సింగరయ్య స్వామి తిరునాళ్ల అత్యంత వైభవంగా జరుగుతుందని, కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరేచర్ల గ్రామస్థులు సింగరయ్య స్వామికి మొక్కుకుంటారని, ప్రస్తుతం అక్రమార్కులు భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా క్వారీయింగ్ చేస్తున్నారని, దీనిని వెంటనే నిలిపి వేయాలని దేవదాయ శాఖ, మైనింగ్ శాఖ అధికారులకు గ్రామస్థులు అల్టిమేటం జారీ చేశారు. లేదంటే తమ ఆందోళనను తీవ్ర తరం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమానికి మాజీ జడ్పీటీసీ సభ్యులు పాములపాటి శివన్నారాయణ, మాజీ సర్పంచ్ గడ్డం రాంబాబు, నాయకులు పి.శ్రీనివాస్, రజనీ కృష్ణ, పమిడి అప్పారావు తదితరులతో పాటు చినపలకలూరు గ్రామస్థులు పాల్గొన్నారు.

పారదర్శకంగా కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు

- దళారులను నమ్మి మోసపోకండి
- ఎస్పీ సతీష్ కుమార్



గుంటూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలను పారదర్శకంగా నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ శనివారం తెలిపారు. అభ్యర్థులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని, డబ్బులు ఇవ్వమని ఎవరైనా ప్రలోభ పెడితే వారి సమాచారాన్ని డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు తెలియజేయాలని చెప్పారు. ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఫిజికల్ మెజర్మెంట్, దేహదారుఢ్య పరీక్షలు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 30 నుంచి వచ్చే నెల 22 వరకు జరుగుతాయని ఎస్పీ వెల్లడించారు. అభ్యర్థులు వారికి కేటాయించిన నిర్ణీత సమయాల్లో మాత్రమే పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు చేరుకోవాలన్నారు. జిల్లాలో మొత్తం 9084 మంది అభ్యర్థులు దేహదారుఢ్య పరీక్షలకు అర్హత సాధించగా వారిలో 7483 మంది పురుషులు, 1601 మంది స్త్రీలు ఉన్నట్లు తెలిపారు. దేహదారుఢ్య పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశామన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్, బయోమెట్రిక్, ఫిజికల్ మెజర్మెంట్, దేహదారుఢ్య పరీక్షలకు సంబంధించి 1600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు ఉంటాయని, వీటిని సంబంధించి విధులు నిర్వహించే సిబ్బందికి ఇప్పటికే అవగాహన కలిగించినట్లు తెలిపారు. దేహదారుఢ్య పరీక్షలకు వచ్చే అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఒక సెట్ అటెస్టెడ్ జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా అందించాలన్నారు.

ఉత్కంఠగా చాంబర్ ఎన్నికలు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన వ్యాపారులు
- ఆలస్యంగా ప్రారంభమైన పోలింగ్.. మొరాయించిన లిఫ్ట్
- సగానికి తగ్గిన పోలింగ్.. అర్ధరాత్రి కూడా కొనసాగిన లెక్కింపు


ఓట్లు వేస్తున్న వ్యాపారులు

గుంటూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పోటాపోటీ ప్రచారాల మధ్యసాగిన ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల పోలింగ్ శనివారం ఉత్కంఠగా జరిగింది. మాజీ కార్పొరేటర్ యేల్చూరి వెంకటేశ్వర్లు, చాంబర్ మాజీ కార్యదర్శి రంగా బాలకృష్ణ ప్యానల్ మధ్య పోటాపోటీగా ప్రచారాలు సాగాయి. ఈ క్రమంలో చాంబర్ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వ్యాపారులు తరలివచ్చారు. వాస్తవానికి ఉదయం 10 గంటలకు ప్రారంభమవ్వాల్సిన పోలింగ్ 11 గంటల తర్వాత ప్రారంభమైంది. జిన్నాటవర్ సెంటర్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనం వద్దకు వ్యాపారులు ఉదయమే చేరుకున్నారు. ఎన్నికల్లో ఎటువంటి ఆందోళనలు, ఘర్షణలు జరక్కుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కొత్తపేట పోలీసులు బందోబస్తు నిర్వహించారు. చాంబర్ ఎన్నికలకు వచ్చే వ్యాపారుల కోసం తమ సీరియల్ నెంబర్లు, ఓటు స్లిప్పులను అందజేసేందుకు భవనం ఎదుట టెంట్‌లు వేయటంతో కోలాహల వాతావరణం నెలకొన్నది. వ్యాపారులు లిఫ్ట్ ఎక్కాల్సి రావడంతో అది మరమ్మతులకు గురైంది. దీంతో మూడంతస్తులు మెట్లు ఎక్కి పైకి వెళ్లాలంటే వ్యాపారులు ఎంతో ప్రయాసలు పడాల్సి వచ్చింది. ఫలితంగా పోలింగ్ శాతం కూడా తగ్గినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

అర్ధరాత్రి వరకు సాగిన లెక్కింపు

సుదీర్ఘ చరిత్ర కలిగిన ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు ఉమ్మడి గుంటూరు జిల్లాలో 3071 మంది సభ్యులు ఓటర్లుగా ఉన్నారు. చాంబర్‌కు అనుబంధ సంఘాలలోని వ్యాపారులు కూడా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంది. కాగా శనివారం జరిగిన ఎన్నికల పోలింగ్ సాయంత్రం 6 గంటలకు ముగిసింది. ఉదయం చాంబర్ కార్యవర్గ సమావేశం ఆలస్యం కావడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైనట్లు చాంబర్ సభ్యులు తెలిపారు. మొత్తం 985 ఓట్లు పోలైనట్లు చాంబర్ కార్యదర్శి అన్నా పూర్ణచంద్రరావు తెలిపారు. ఓటింగ్ కూడా రహస్య బ్యాలెట్‌లో జరిగింది. బ్యాలెట్ పత్రాలపై ఓటు వేసేందుకు ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రంలో ఆరు ప్రత్యేక రహస్య కౌంటర్లను ఏర్పాటు చేశారు. పోలింగ్ తర్వాత ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టగా అది అర్ధరాత్రి వరకు కొనసాగింది. యేల్చూరి, రంగా బాలకృష్ణకు సంబంధించిన ఇరు ప్యానల్స్ ఓట్లను వేర్వేరు చేసే ప్రక్రియకే రాత్రి పది గంటలు దాటింది.

సమసమాజం వస్తుందన్న విశ్వాసంతో సాగాలి

- ప్రొఫెసర్ హరగోపాల్



నరసింహారావు సంస్మరణ సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

గుంటూరు సిటీ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఎన్ని పరిణామాలు చోటుచేసుకున్నా న్యాయబద్ధమైన, మానవీయమైన సమసమాజం వస్తుందన్న విశ్వాసంతో ముందుకు సాగాలని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. శనివారం గుంటూరులో జరిగిన ఎస్వీ నరసింహారావు సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు. సోవియట్ యూనియన్ కూలిపోయిన తర్వాత ప్రపంచంలోని ఉద్యమాలు కుదుపునకు లోనయ్యాయని అన్నారు. ఆ సందర్భంలో చాలామంది ఉద్యమకారులు నిరాశ పడ్డారని పేర్కొన్నారు. అయితే శ్రమకు, పెట్టుబడికి మధ్య నిరంతరం పోరాటం ఉంటుందని నమ్మిన వాళ్ల మాత్రం ఏ నమ్మకంతో అయితే ఎర్రజెండా పట్టారో అదే నమ్మకంతో ముందుకు సాగారని అన్నారు. భారత దేశ విప్లవ పంథాను ప్రభావితం చేసిన చైనాలో నేడు పరిస్థితి వేరుగా ఉందన్నారు. ఏదో ఒక రోజు అందరూ కలలుకనే సమసమాజం తప్పక వస్తుందని అన్నారు. ఎస్వీ నరసింహారావు తన జీవిత కాలంలో ఉద్యమాలు, ఎన్నో ఆటుపోట్లను చవిచూసినా ఎర్రజెండాను వదలలేదని అన్నారు. అటువంటి విశ్వాసం కలిగిన వాళ్లే నేటి ఎర్రజెండాను, సమసమాజ స్ఫూర్తిని ముందుకు తీసుకువెళ్తారని అన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం నేతలు చిలకా చంద్రశేఖర్, సీఎస్ఆర్, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోల్‌మాల్

- ఎస్సీ కార్పొరేషన్‌లో అక్రమాలు
- సాంకేతిక సమస్యలతో గోదాముల్లో ఆటోలు
- తుప్పుపట్టిపోతోన్న డ్రైయిన్ క్లీనింగ్ యంత్రాలు
- విజిలెన్స్ విచారణతో వెలుగుచూడనున్న అక్రమాలు


గోడకూలి ధ్వంసమైన ఈ-ఆటో


చెత్త తరలించే ట్రాక్టర్లు

గుంటూరు(విద్య), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయంలో ఎస్సీ కార్పొరేషన్ కొనుగోలు చేసిన ఈ ఆటోలు, మెకనైజ్డ్ డ్రెయిన్ క్లీనింగ్ యంత్రాల కొనుగోళ్లలో భారీ అక్రమాలు జరిగినట్లు విజిలెన్స్ నిర్ధారణకు వచ్చింది. ఉమ్మడి గుంటూరు జిల్లాకు ఈ అక్రమాల సెగ తగిలింది. నిరుద్యోగ దళిత యువతకు స్వయం ఉపాధి కోసం గత ప్రభుత్వం ఈ-ఆటోలు, చెత్త తరలించే ట్రాక్టర్లు, మెకనైజ్డ్ డ్రెయిన్ క్లీనింగ్ పరికరాలు కొనుగోలు చేసింది. ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన ఈ పరికరాలు సాంకేతిక సమస్యలతో పనిచేయడంలేదు. దీంతో అధికారులు వాటిని గోదాములకే పరిమితం చేశారు. తాజాగా ఈ ఆటోలు కొనుగోళ్లపై రాష్ట్రస్థాయిలో విజిలెన్స్ అధికారులు దృష్టి సారించారు. దీంతో అవి చేయవని తేలింది. పనిచేయని పరికరాల విషయంలో ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందోనని అధికారులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో రూ.93.98 కోట్లు వెచ్చించి ఆయా పరికరాలు కొనుగోలు చేశారు. పూణేకు చెందిన కెనటిక్ గ్రీన్‌ఎనర్జీ అండ్ పవర్ సొల్యూషన్స్ లిమిటెడ్ సంస్థ నుంచి దాదాపు 100కు పైగా ఈ ఆటోలు, మెకనైజ్డ్ డ్రెయిన్ క్లీనింగ్ మిషన్లు జిల్లాకు వచ్చాయి. వీటిలో పదుల సంఖ్యలో సాంకేతిక సమస్యలు తలెత్తి పనిచేయడం లేదు. వాటిని నిల్వ చేసిన గోదాములకు అద్దె చెల్లించలేక కొన్నింటిని జిల్లాకేంద్రానికి తీసుకు వచ్చారు. ఎస్సీ కార్పొరేషన్ సమావేశ మందిరం పక్కన ఉన్న గోదాముల్లో ఈ ఆటోలు మగ్గుతున్నాయి. వాటిలో అనేకం ఇప్పటికే ధ్వంసమయ్యాయి. సాంకేతిక సమస్యలున్న వాటిని కంపెనీలకు తిరిగిపంపలేదు. రాష్ట్రస్థాయిలో విజిలెన్స్ అధికారులు దర్యాప్తు ప్రారంభించగా అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. మరోవైపు పంపిణీ చేసిన వస్తువులు కూడా ప్రస్తుతం ఎలా ఉన్నాయనే విషయాలపై అధికారులు పరిశీలన చేస్తారని సమాచారం. ఇందులో సూత్రధారిగా ఎస్సీ కార్పొరేషన్‌లో నాడు చక్రం తెప్పిన ఓ ఉన్నతాధికారి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.


ఎస్సీ కార్పొరేషన్ సమావేశ మందిరం పక్కన ఉన్న షెడ్డులో ఈ-ఆటోలు

వేళంకణ్ణి పండగకు ప్రత్యేక రైలు

గుంటూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని నాగపట్టణంలో జరిగే వేళంకణ్ణి పండగకు ప్రత్యేక రైలుని నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు 07125 సికింద్రాబాద్ - వేళంకణ్ణి రైలు ఈ నెల 30వ తేదీన రాత్రి 8 గంటలకు బయలుదేరి నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల మీదగా మరుసటి రోజు రాత్రి 7.30కి వేళంకణ్ణి చేరుకొంటుంది. నం.07126 వేళంకణ్ణి-సికింద్రాబాద్ రైలు జనవరి 1వ తేదీన రాత్రి 10 గంటలకు పైన పేర్కొన్న స్టేషన్ల మీదగా తిరుగు ప్రయాణమై మరుసటి రోజు రాత్రి 10.45కి సికింద్రాబాద్ చేరుకొంటుంది.

అరుణాచలంకు ప్రత్యేక రైలు

నం.07601 సికింద్రాబాద్-విల్లుపురం ప్రత్యేక రైలు జనవరి నుంచి మార్చి నెల వరకు ప్రతీ గురువారం రాత్రి 7.40కి బయలుదేరి నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 11.50కి తిరువణ్ణామలై(అరుణాచలం), మధ్యాహ్నం 1.05కి విల్లుపురం చేరుకొంటుంది. నం.07602 విల్లుపురం - సికింద్రాబాద్ రైలు ప్రతీ శుక్రవారం సాయంత్రం 4.05కి పైన పేర్కొన్న స్టేషన్ల మీదగా తిరుగు ప్రయాణమై మరుసటి రోజు ఉదయం 9.40కి సికింద్రాబాద్ చేరుకొంటుంది.

డాక్టర్ జగదీష్‌కు బంగారు పతకం

తెనాలి(మారీసుపేట), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలో అత్యుత్తమ వైద్యసేవలకుగాను తిరుపతికి చెందిన ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ గుడారు జగదీష్‌కు బంగారు పతకాన్ని ఐఎంఏ సభ్యులు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక బోసురోడ్డులోని ఐఎంఏ తెనాలిశాఖ కార్యాలయంలోని హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ మేజర్ కాకుమాను హాళ్ళక్కి స్మారక ఎండోమెంటు గోల్డ్‌మెడల్‌ను జగదీష్‌కు తెనాలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ అనిల్ కుమార్, కార్యదర్శి డాక్టర్ జీ మధు ప్రభాకర్‌బాబు, చందు సాంబశివుడు అందజేశారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ డాక్టర్ మేజర్ కాకుమాను హాళ్ళక్కి పేరున అందిస్తున్న ఈ గోల్డ్ మెడల్‌ను తాను అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలలో వచ్చిన నూతన విధానాలు, చికిత్సలపై వైద్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పావని ప్రియాంక, డాక్టర్‌లు పాటిబండ్ల దక్షిణామూర్తి, చందు సాంబశివుడు, పురుషోత్తం, వేమూరి శేషగిరిరావు తలశిల రాకేష్, తాడిబోయిన మస్తానమ్మ, సాంబిరెడ్డి, కోటి నాగయ్య పాల్గొన్నారు.


డాక్టర్ జగదీష్‌కు బంగారు పతకాన్ని అందజేసిన ఐఎంఏ తెనాలి శాఖ అధ్యక్షుడు అనిల్ కుమార్, సాంబశివుడు, మధు ప్రభాకర్‌బాబు, ప్రియాంక తదితరులు

గుంటూరు రూరల్ వార్తలు

మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

రేపు వీజే డిగ్రీ కళాశాలలో జాబ్ డ్రైవ్

మంగళగిరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన మంగళగిరిలో జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. గణపతి నగర్‌లోని వీజే డిగ్రీ కళాశాలలో సోమవారం ఉదయం పది గంటల నుంచి జాబ్ డ్రైవ్ ప్రారంభమవుతుందన్నారు. మంగళగిరి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు షేక్ మహమ్మద్ రఫీ 8886065546, జీవీఎస్ శివకుమార్ 8074597926 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వాగును కృష్ణానదిలోకి డైవర్ట్ చేయాలి

తాడేపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఉండవల్లిలో కొండవీటివాగు వెడల్పు చేసేందుకు అధికారులు సర్వే జరిపి మార్కింగ్ వేశారని అయితే కొండవీటి వాగును వెడల్పు చేసేకంటే పైన అమరావతి నుంచి వచ్చే వాగును అక్కడే డైవర్ట్ చేసి కృష్ణానదిలోకి మళ్లించాలని రాజధాని రైతు సంఘం అధ్యక్షుడు కే ఈశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఇలా చేస్తే అతి తక్కువ ఖర్చుతో వాగును డైవర్ట్ చేయొచ్చని, ఇంత భారీ ప్రాజెక్టు అవసరం ఉండదని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం స్పందించి తాడికొండ దగ్గర, లేదా అమరావతి దగ్గర వాగు నీరు ఇటువైపు రాకుండా డైవర్ట్ చేస్తే సరిపోతుందన్నారు. ప్రభుత్వం ఈ విషయంపై పునరాలోచన చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు బక్కిరెడ్డి, కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఎంపీడీవోపై దాడి హేయం

తాడికొండ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై వైసీపీ నాయకుడు చేసిన దాడి హేయమని తాడికొండ ఎంపీడీవో సమతావాణి అన్నారు. శనివారం ఎంపీడీవో జవహర్‌బాబుపై జరిగిన దాడిని నిరసిస్తు తాడికొండ మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది, అధికారుల, గ్రామీణ ఉపాధి హమీ పథకం సిబ్బంది నల్లరిబ్బన్లు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఈవోపీఆర్‌డీ, డీఆర్‌డీఏ సిబ్బంది, ఎన్‌ఆర్‌జీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అండగా సీపీఐ

తాడికొండ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సీపీఐ పేదలకు ఎప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. శనివారం సీపీఐ శత వార్షికోత్సవాలు పొన్నెకల్లు పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో అనేక సమస్యలపై సీపీఐ అలుపెరుగని పోరాటాలు చేసి వాటిని సాధించిందని గుర్తు చేశారు. ఏపీలో కుల పార్టీల ప్రాబల్యం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజధాని అమరావతిని కొనసాగించేందుకు సీపీఐ అనేక పోరాటాలు చేసిందన్నారు. గ్రామాల్లో సీపీఐ బలపడవలసిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పచ్చల సాంబశివరావు, ముప్పాళ్ల శివశంకరావు, రామినేని రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటం

● ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం కిరణ్

పెదనందిపాడు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ అలుపెరగని పోరాటం చేస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం కిరణ్ అన్నారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో శనివారం ఎస్ఎఫ్ఐ మండల నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా ఈశ్వర్, కార్యదర్శిగా అభిలాష్, ఉపాధ్యక్షులుగా అభి, యశ్వంత్, సహాయ కార్యదర్శిగా భాగ్యరాజు, శ్యామ్‌లను ఏకగ్రీంవగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఈశ్వర్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు షేక్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మనస్సులోని ఆందోళన దూరం

దుగ్గిరాల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ధ్యానంతో అంతర్గత ఆందోళనను దూరం పెట్టవచ్చునని రామచంద్రమిషన్ జోనల్ కో- ఆర్డినేటర్ సుంకర కోటేశ్వరరావు అన్నారు. దుగ్గిరాలలోని విమలానంద ఆశ్రమావరణలోని శ్రీసద్గురు శుభవేదికలో మూడ్రోజులుగా ధ్యానశిక్షణ జరుగుతున్న విషయం విదితమే. చివరిరోజు శనివారం సాయంత్రం జరిగిన ధ్యాన శిక్షణలో సుంకర మాట్లాడుతూ రాత్రి నిద్రకు ముందు చేసే ధ్యానం కూడా ప్రశాంతతనిస్తుందన్నారు. ధ్యానం ముగింపు శిక్షణలో 300 మందికి మందికి పైగా గ్రామస్థులు హాజరయ్యారు.

శివాలయంలో శని త్రయోదశి పూజలు

మంగళగిరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శని త్రయోదశిని పురస్కరించుకుని మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలోని నవగ్రహ మండపంలో శనివారం భక్తులు శనీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనైశ్చర స్వామికి నువ్వుల నూనెతో అభిషేకాలు, అర్చనలు, జపాలు, హోమాలు నిర్వహించి పురోహితులకు నువ్వులు దానంగా సమర్పించారు.

భక్తి ప్రపత్తులతో పానకాలస్వామి మెట్ల పూజ

మంగళగిరి సిటీ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడకు చెందిన శ్రీగోవిందనామ ప్రచార సేవాసంఘం ఆధ్వర్యంలో శనివారం మంగళగిరి పానకాల లక్ష్మీనృసింహ స్వామి సన్నిధిలో మెట్లపూజ వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీభక్తి సుందర మంగళ మహరాజ్ పర్యవేక్షణలో సంఘం నిర్వాహకులు సునీత, మధుసూదన్ దంపతులతోపాటు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. 365 మెట్లలో ప్రతి మెట్టును ఆవుపేడతో అలికి పసుపు, కుంకుమ, తులసి ఆకులు ఉంచి దీపారాధన చేశారు. కార్యక్రమంలో మాజేటి సూర్యవేణు గోపాలకృష్ణ, గాదంశెట్టి సుజాత, ఆలేటి నాగలక్ష్మి, దేవతి భగవన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం కలిగిన వారికే ప్రాధాన్యం



విద్యార్థినులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న న్యాయనిర్ణేతలు, ప్రిన్సిపాల్

వట్టిచెరుకూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సీ రంగాల్లో నైపుణ్యం కలిగిన విద్యార్థులకే ఇండస్ట్రీస్ అవకాశం కల్పిస్తున్నాయని రాజేష్ సుంకవల్లి, రోహిత, రవితేజ వివరించారు. మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఏఐ అండ్ ఐవోటీ 36 గంటల హోసికతోన్ కార్యక్రమం ముగిసింది. కార్యక్రమంలో మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ చదువుతున్న 150 మంది ఈసీఈ విభాగానికి చెందిన విద్యార్థినులు 28 బ్యాచ్‌లుగా పోటీపడ్డారు. ఈ కార్యక్రమానికి మేక్ స్కిల్డ్ నుంచి మెంటార్స్‌గా వ్యవహరించారు. న్యాయ నిర్ణేతలుగా హెడ్‌డబ్ల్యూఏఎఫ్‌యూ టెక్నాలజీ ఐఎస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో రోహిత్ రవితేజ, హైదరాబాద్ ఇన్ఫోసిస్ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ రాజేష్ సుంకవల్లిలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి ప్రస్తుతం ప్రతి ఇండస్ట్రీ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో నైపుణ్యం కలిగిన విద్యార్థులకు అవకాశాలు కల్పిస్తున్నారని వారు గుర్తు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జెట్టి అప్పారావు, విభాగాధిపతి డీ విజయసారథి, అధ్యాపకులు, అధ్యాపకేతరులు పాల్గొన్నారు.

పంట కాలువలకు మోక్షం

● ఐదేళ్లుగా నిరాదరణ ● రైతులకు దన్నుగా కూటమి ప్రభుత్వం

● పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్‌కు 75 లక్షలు మంజూరు



మల్లాయపాలెం మేజర్‌లో దట్టంగా పెరిగిన నాచు, తూటాకు, జమ్ము

ప్రత్తిపాడు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చివరి భూముల వరకు సాగు నీరు అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తి నిరాదరణకు గురైన కాలువల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నడుం బిగించింది. సాగునీటి సంఘాల ఎన్నికలు పూర్తి కాగానే కాలువలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. ఐదేళ్లుగా పంటలు సరిగా లేక ఈ ప్రాంతంలో అన్నదాత పూర్తిగా అప్పుల ఊబిలో మునిగిపోయాడు. నాగార్జున సాగర్‌కు చివరన ఉన్న ప్రత్తిపాడు ప్రాంతానికి సాగు, తాగునీరు కాలువల ద్వారానే రావలసి ఉంది. ఆ కాలువలను ఐదేళ్లుగా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ పరిస్థితుల్లో అన్నదాతకు అండగా ఉండేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుంది.

ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను మండలాలకు పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్ నుంచి పాతమల్లాయపాలెం మేజర్, కాకుమాను మేజర్ ద్వారా సాగు, తాగు నీరు అందాల్సి ఉంది. అయితే ఈ కాలువలు మొత్తం నాచు, తూటాకు, జమ్ము, గడ్డితో పూర్తిగా నిండి పోయి ఉంది. నీరు వదిలినా కూడా చివరి వరకు నీరు అందని పరిస్థితి నెలకొంది. దాదాపు అన్ని కాలువల్లో ఇదే పరిస్థితి నెలకొంది. దీనిపై ఎంతో కాలంగా రైతులు అధికారులు, ప్రజా ప్రతినిదుల చుట్టూ తిరుగుతూ ఉన్నారు. ఇంత వరకు కాలువల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సాగునీటి కాలువలపై దృష్టి పెట్టారు. ఈ మేరకు పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్ నుంచి పాతమల్లాయపాలెం, కాకుమాను మేజర్లతో పాటు వీటికి అనుసంధానంగా ఉండే మైనర్ కాలువలను బాగు చేయడానికి సుమారు రూ.75 లక్షల నిధులను మంజూరు చేశారు. ఈ డబ్బుతో అన్ని కాలువలలో నాచు, తూటాకు గడ్డిని తొలగించడంతో పాటు కాలువలను బాగు చేస్తారు. అయితే పంట కాలువలతో పాటు మురుగుకాలువలు ప్రవహించే చోట ఉండే సైఫన్‌ల వద్ద కూడా పగుళ్లు ఉన్నాయి. అక్కడ ఉండే బావుల వద్ద పగుళ్లు రావడంతో నీరు వదిలిన సమయంలో ఎక్కువ నీరు వాగుల్లోనికి వృథాగా పోతున్నాయి. వీటిని కూడా వేసవి కాలంలో మొత్తం బాగు చేయడానికి పక్కా ప్రణాళిక తయారు చేశారు. వేసవి కాలం పూర్తయి తిరిగి పంటలు వేసే సమయానికి కాలువలను సిద్ధం చేయనున్నారు. దీని ద్వారా ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను మండలాల్లో వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుంది.



సైఫన్‌ల వద్ద గల బావులు లీకులు రావడంతో వృథాగా వాగులో కలుస్తున్న నీరు

75 లక్షల నిధులు మంజూరయ్యాయి

● ఎన్ఎస్‌బీ డీఈ శ్రీనివాసరావు

కాలువల్లో పేరుకు పోయిన నాచు, తూటాకు, జమ్మును తొలగించేందుకు ప్రభుత్వం 75 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసినట్లు ఎన్ఎస్‌బీ కెనాల్స్ డీఈ శ్రీనివాసరావు తెలిపారు. కాకుమాను, మల్లాయపాలెం మేజర్ కాలువలకు రూ.40 లక్షలు మంజూరు కాగా, వాటికి సంబంధించి బ్రాంచ్‌లకు 35 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. ఇవి కాక కొత్తగా ఏమైనా సమస్యలు ఉన్నా వాటిని కూడా పరిష్కరిస్తామని డీఈ శ్రీనివాసరావు తెలిపారు.

క్రీడా పోటీల్లో చలపతి విద్యార్థులకు బంగారు పతకాలు

తాడికొండ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు బంగారు పతకాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం చంద్రశేఖర్ పేర్కొన్నారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులను శనివారం కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇటీవల హిందూ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదర్శ-2024 పేరుతో జాతీయ స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహించారని తెలిపారు. 30 కళాశాలలకు పైగా పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థులకు వేరువేరుగా నిర్వహించిన చదరంగం పోటీల్లో ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతున్న నాగూర్, మేఘనలు మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం గెలుచుకున్నారని తెలిపారు. క్యారమ్స్ పోటీల్లో లీలా శ్వేత, మైత్రిలు వెండి పతకాలు సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థుల ను కళాశాల చైర్మన్ వైవీ ఆంజనేయులు, సెక్రటరి వై సుజిత్‌కుమార్‌లు అభినందించారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ జే.లక్ష్మీనారాయణ, బేసిక్ సైన్స్ విభాగాధిపతి రాధాకృష్ణమూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాసులు, వ్యాయామ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో వ్యవసాయాధికారుల తనిఖీలు

● 31లోగా రబీపంటలకు బీమా చేయించుకోవాలి : ఏవో శిరీష

దుగ్గిరాల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎరువులను అధిక ధరలకు విక్రయించినట్లైతే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి పి.శిరీష తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో వ్యవసాయాధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎరువుల నిల్వలతో పాటు, బరువు, గరిష్ఠ విక్రయధరలు, కాలపరిమితితోపాటు రికార్డులు తనిఖీ చేశారని ఏవో తెలిపారు. మండలంలో 10 దుకాణాలుండగా పేరుకలపూడి, ఈమని గ్రామాల్లోని ఐదు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు.

● రైతులందరూ రెండో పంటకు సంబంధించి ఈనెల 31వ తేదీలోగా బీమా చేయించుకోవాలని ఏవో శిరీష తెలిపారు. మొక్కజొన్న పంటకు ఎకరాకు రూ.114లు, జొన్నకు రూ.48లు, పెసరకు ఎకరాకు రూ.45ల చొప్పున బీమా చెల్లించాలన్నారు. రైతులు వారి సమీపంలో నున్న రైతుసేవా కేంద్రాలకు వారి పొలం పట్టాదారు పుస్తకం నకలు, ఆధార్ నకళ్లను వెంట తీసుకెళ్లాలని, పంటనమోదు అనంతరం బీమా కూడా చెల్లించినట్లైతే, భవిష్యత్తులో పంట విక్రయించేందుకు అవకాశం కలుగుతుందని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సైతం బీమా ఆవశ్యకతను పలుమార్లు రైతులకు తెలియజేశామన్నారు.

ఐదేళ్లలో విద్యుత్‌రంగం అస్తవ్యస్తం

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

గుంటూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో విద్యుత్‌రంగం అస్తవ్యస్తంగా తయారైందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ చార్జీలపై రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులుగా దుష్ప్రచారం జరుగుతోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వంద రోజుల వ్యవధిలో విద్యుత్ కోతలేని రాష్ట్రంగా తీర్చిదిద్దిన సంగతి ప్రజలకు తెలిసిందేనన్నారు. గత ఐదేళ్లలో జగన్‌రెడ్డి విద్యుత్ చార్జీలు 9 సార్లు పెంచి పేదల నడ్డి విరిచాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్మోహన్‌రెడ్డి నిర్వాకంతో లక్ష 29 వేల 500 కోట్ల భారం ప్రజలపై పడిందన్నారు. సోలార్ ఎనర్జీ పవర్ పర్చేజ్ పేరుతో అదాని గ్రూపుతో ఒప్పందం కుదుర్చుకుని రూ.1,750 కోట్ల లంచం తీసుకున్న ఘనుడు జగన్‌రెడ్డి అని విమర్శించారు. పోలవరం పూర్తి చేస్తే 2వేల మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుతుందని తెలిసి పోలవరం ప్రాజెక్టును నిర్వీర్యం చేశాడని దుయ్యబట్టారు. సమావేశంలో దాసరి రాజా మాష్టారు, కంచర్ల శివరామయ్య, దామచర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కులగణనపై అభ్యంతరాలు తెలియజేయాలి : తహసీల్దార్

కాకుమాను, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పంచాయతీల్లో షెడ్యూల్ కులాల వారి కుల సర్వే జాబితా వివరాలు ఆయా గ్రామాల సచివాలయాల్లో ఈ నెల 26న ప్రచురించామని వాటిలో ఆయా కులాల వారికి అభ్యంతరాలు ఉంటే వెంటనే స్థానిక వీఆర్వో లేదా పంచాయతీ కార్యదర్శికి తెలియజేయాలని తహసీల్దార్ వెంకటస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తుది జాబితా జనవరి 10న మళ్లీ ప్రచురణ చేస్తామన్నారు.

హిందూ ధర్మంపై అసత్య ప్రచారాలు మానుకోవాలి

తాడేపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మంపై, ఆలయాలపై అసత్య ప్రచారాలు మానుకోవాలని గుంటూరు హిందూ ధర్మ ప్రచార సమితి ప్రతినిధి వేణుగోపాల్ అన్నారు. శనివారం తాడేపల్లి మండలం పెనుమాక శ్రీ వైష్ణవ దివ్యక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేణుగోపాల్ మాట్లాడుతూ హిందూ ధర్మం మీద అసత్య ఆరోపణలు చేసినా.. హిందూ ధర్మానికి ఎటువంటి ఆటంకం కలిగినా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు.

పరిశ్రమల యాజమానులకు న్యాయం చేయాలి



మంత్రి నారాయణను కలిసిన పరిశ్రమల యజమానులు

మంగళగిరి సిటీ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలో ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ఈ-11 రహదారి వల్ల పలువురు పరిశ్రమల యజమానులు తమ పరిశ్రమలను కోల్పోయే ప్రమాదం ఉందని ఎర్రబాలెం పరిశ్రమల యజమానులు, అద్దెదారులు మంత్రి నారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ-11 రహదారి మార్గం నిర్మాణానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే ఈ రహదారి వల్ల స్థలం, పరిశ్ర మలు కోల్పోతున్న యాజమానులు, అద్దెదారులకు న్యాయం చేయాలని కోరారు. సీఎం చంద్రబాబు ఈ-11 రహదారి ఎలైన్‌మెంట్‌లో మార్పు చేసేందుకు అంగీకరించారని, పరిశ్రమల యాజమానులు, అద్దెదారులను సమావేశపరిచి తగు న్యాయం చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఎర్రబాలెం ఇండస్ట్రియల్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బహదూర్, కార్యదర్శి రామరాజు, షేక్ సలీమ్, రావెల శ్రీనివాసరావు, టీడీపీ నేత ఆకుల ఉమా మహేశ్వరరావు, అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చలపతి ఫార్మసీ కళాశాలలో క్విజ్ పోటీలు

తాడికొండ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): లాం చలపతి ఫార్మసీ కళాశాలలో జాతీయ ఫార్మ క్విజ్ పోటీలను శనివారం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి ఫార్మ క్విజ్ పోటీల్లో 12 కళాశాల నుంచి 52 టీంలు పాల్గొన్నాయని తెలిపారు. పోటీల్లో 6 రౌండ్లు ఉంటాయని, ఒక్కో రౌండ్ ఒక్కో అంశంపై నిర్వహించినట్లు తెలిపారు. 52 టీమ్‌లు ప్రిలిమినరీ రౌండ్‌లో పాల్గొనగా వారిలో 10 టీంలు సెమీఫైనల్‌కు చేరుకోగా వాటిలో 4టీమ్‌లు విజయాన్ని సాధించినట్లు తెలిపారు. క్విజ్ పోటీల్లో బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఫార్మా డీ, విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో మలేషియా క్వెస్ట్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ విజయ కొత్ర, సొల్యూషన్స్ ఇన్‌స్టిట్యూట్ అఫ్ మెంటల్ హెల్త్ సైన్సెస్ సైకాలజిస్ట్ కౌన్సిలర్ నగేష్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.



31న పురపాలక సంఘ సాధారణ, ప్రత్యేక సమావేశం

తెనాలి(మారీసుపేట), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ సాధారణ, ప్రత్యేక సమావేశాలను ఈ నెల 31న నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక శనివారం తెలిపారు. ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్‌లో సాధారణ సమావేశం, 11.45 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వార్డు కౌన్సిలర్లు, ఎక్స్ అఫిషియో మెంబరు, కో ఆప్షన్ సభ్యులు, ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.

31నే పింఛన్ల పంపిణీ

తెనాలి రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా ఒకటవ తేదీన అందించాల్సిన సామాజిక పింఛన్లను ఒకరోజు ముందుగా 31నే అందించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఈవోపీఆర్డీ వైవీడీ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పింఛన్ల సొమ్మును ప్రభుత్వం ఈ నెల 30వ తేదీనే బ్యాంకు ఖాతాలకు జమచేయనుందని, సచివాయ అధికారులు వాటిని సకాలంలో డ్రా చేసి సిబ్బందితో లబ్ధిదారుల ఇంటివద్దకే వెళ్లి పింఛన్ల సొమ్మును అందించాలని తెలిపారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన కమిషనర్

తెనాలి (మారీసుపేట) డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 5, 6వ వార్డులలో జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ శేషన్న అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైన్లలోని వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోడ్లపై చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధనుర్మాస వ్రత మహోత్సవాలు

తెనాలి అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వీఎస్‌ఆర్ కళాశాల రోడ్డులో ధనుర్మాస వ్రత మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శరణగతి ఘోష్ఠి ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాలలో 13వ రోజు పాశురాన్ని ప్రవచించారు. దాతలు వెండి పళ్లెం బహూకరించారు. నరేంద్ర రామానుజ దాసస్వామి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు.

నేడు మెరిట్ స్కాలర్‌షిప్‌ల ప్రదానం

తెనాలి అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కృష్ణదేవరాయ ఎడ్యుకేషనల్ ప్రోగ్రెసివ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మెరిట్ స్కాలర్‌షిప్‌ల ప్రదానోత్సవం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని అసోసియేషన్ కార్యదర్శి తాడికొండ చిన్నబ్బాయి తెలిపారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో దాతల సహకారంతో గత విద్యా సంవత్సరంలో ప్రతిభ చూపిన 341 మంది విద్యార్థులకు రూ.16 లక్షల నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

సౌపాటి ప్రభాకర్‌కు కవి సత్కారం

పొన్నూరుటౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బ్రాహ్మణ కోడూరుకి చెందిన కవి సౌపాటి ప్రభాకర్‌కు కవి సత్కారం లభించింది. ఇటీవల విజయవాడలో జరిగిన ప్రపంచ మహా తెలుగు మహాసభలలో జరిగిన కవి సమ్మేళనంలో ప్రభాకర్ పాల్గొని తెలుగు భాష పై కవితా గానం చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌ను సత్కరించి, నిర్వాహకులు అభినందించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

పొన్నూరుటౌన్, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు శనివారం టీడీపీ నాయకులు అందజేశారు. నిడుబ్రోలు 11వ వార్డుకు చెందిన పాములపాటి సాంబశివరావుకు రూ. 1,52,202 చెక్కును, 24వ వార్డుకు చెందిన కొడాలి వెంకట సూర్యవతికి రూ. 95,837 చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అలపర్తి చంద్రమోహన్, జాగర్లమూడి సుధీర్ లక్ష్మి నారాయణ చౌదరి, పటాన్ అహ్మద్ ఖాన్, పఠాన్ ఫైరోజ్ ఖాన్, అనిశెట్టి వీరబాబు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

కొల్లిపర, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజనం పథకంపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. మండల పరిధిలోని పిడపర్తిపాలెం, పిడపర్రు ప్రాథమిక పాఠశాలలను శనివారం ఆయన తనిఖీ నిర్వహించారు. పాఠశాలల్లో రికార్డులను, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం విషయంలో ఏజెన్సీ నిర్వాహకులు అజాగ్రత్త వహిస్తే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి పాఠశాలలోను పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను ఉపాధ్యాయులు అందించాలని, విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులతో చర్చించాలని, పాఠశాలల్లో సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

బీసీ సంఘ నేత శేషంరాజు వర్ధంతి



శేషంరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంఘ నాయకులు

తెనాలి అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రామలింగేశ్వరపేటలో శనివారం బీసీ సంఘ నాయకుడు తంగెళ్ల శేషంరాజు వర్ధంతి నిర్వహించారు. శేషంరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు మాట్లాడుతూ, బీసీ సంఘాల అభివృద్ధికి ఆయన ఎనలేని కృషి చేశారని చెప్పారు. ఇళ్ల స్థలాలతో పాటు ఇంటి నిర్మాణానికి కూడా సహాయం అందేలా చేశారని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భట్రాజు సంఘ ఫెడరేషన్ ఏర్పాటు అయ్యేలా ఆనాటి పెద్దలతో శేషంరాజు మాట్లాడిన విషయాన్ని గుర్తుచేశారు. సంఘ అధ్యక్షుడు గంగరాజు, జొన్నాదుల వెంకటేశ్వరరావు, కొండరాజు, రఘునాథరాజు, సత్యనారాయణరాజు, అనురాధ, రమాదేవి, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

పొన్నూరుటౌన్, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా చైల్డ్ ఆర్గనైజేషన్ అధికారి విజయకుమార్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కిశోరి వికాసం కార్యక్రమంపై శనివారం శిక్షణా తరగతులు జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన విజయకుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. బాలికల అక్రమ రవాణాపై అవగాహన అవసరం అని, బాల్య వివాహాల నిరోధక చట్టం, లైంగిక నేరాల చట్టాలపై బాలికలకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. బాల్య వివాహాలకు సంబంధించి సమాచారం ఇస్తే తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం, మున్సిపల్ కార్యాలయ అధికారులు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు స్వస్తి చెప్పేందుకే రెవెన్యూ గ్రామసభలు



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ జియావుల్ హక్

తెనాలి రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు స్వస్తి చెప్పేందుకే రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ చెప్పారు. రెవెన్యూ గ్రామసభల్లో భాగంగా మండలంలోని కొలవరంలో రైతుల నుంచి భూ సమస్యలకు సంబంధించిన వివిధ అర్జీలను శనివారం ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పది అర్జీలు అందినట్లు చెప్పారు. అందులో ఒకటి మ్యూటేషన్ కోసం, సర్వే కోసం 8, ప్రైవేట్ భూములను వక్ఫ్ భూములుగా చూపారంటూ మరో అర్జీ వచ్చినట్లు వివరించారు. రైతులు తన దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యను సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. సర్పంచ్ బండికళ్ల ప్రసాద్, రెవెన్యూ, దేవాదాయ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 40 అర్జీలు

పొన్నూరుటౌన్, డిసెంబరు28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ములుకుదరులో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సుకు 40 అర్జీలు దాఖలైనట్లు తహశీల్దార్ జియావుల్ హక్ తెలిపారు. మ్యూటేషన్ కోసం 13 అర్జీలు. పాసుపుస్తకాలకు 10 దరఖాస్తులు, 4 అడంగల్ మార్పు కోసం, 8 ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం 1, 22ఎ కి 1 దరఖాస్తు, కుల ధ్రువీకరణకు 2, రిజిస్ట్రేషన్ వాల్యూయేషన్ కోసం 1 దరఖాస్తు అందినట్లు పేర్కొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ జీవిత విశేషాలతో సినిమా

● చిత్ర దర్శకుడు దిలీప్ రాజా



సమావేశంలో మాట్లాడుతున్న దిలీప్‌రాజా

గుంటూరు(తూర్పు), డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ నిజజీవిత చరిత్రను తెరకెక్కిస్తున్నట్టు చిత్ర దర్శకుడు దిలీప్ రాజా తెలిపారు. స్థానిక అరండల్‌పేటలోని ఒక హోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్విట్ ఇండియా, సత్యాగ్రహం ఉద్యమాల్లో గాంధీజీతో కలసి స్వాతంత్ర్య సంగ్రామంలో జగ్జీవన్‌రామ్ పాల్గొన్నారని చెప్పారు. రాజ్యాంగంలో అంబేడ్కర్ పొందుపరచిన సంస్కరణలను పార్లమెంటులో ఆమోదం పొందేలా జగ్జీవన్ రామ్ కృషి చేశారని గుర్తుచేశారు. ఈ చిత్రంలో భగత్ సింగ్, ఆజాద్, సుభాష్ చంద్రబోస్ పాత్రలు ఉన్నాయని చెప్పారు. జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా వచ్చే ఏడాది జూలై 6న ఈ సినిమాను విడుదల చేస్తామని తెలిపారు. సమావేశంలో చిత్రసహాయ దర్శకుడు నరేష్ దోనే, మణివరన్ పాల్గొన్నారు.

బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలి



కొల్లిపరలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

కొల్లిపర, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు తగు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి ఎస్. సుమంత్ అన్నారు. మండల కేంద్రం కొల్లిపరలో వైద్యాధికారులు శనివారం ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు బాలింతలకు, చిన్నారులకు, రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సుమంత్ మాట్లాడుతూ బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహా మేరకు ప్రతిరోజు మందులను వేసుకోవాల్సిందేనని తెలియజేశారు. ప్రతి నెలా ఈ ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నా మన్నారు. మంచంలో ఉన్న వారికి కూడా ఇంటికి వెళ్ళి వైద్యసదుపాయం కల్పించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ కల్యాణి, ఏఎన్ఎమ్ మణిమ్మ, హెల్త్‌అసిసెంట్ శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు ప్రేమకుమారి, వాణి, డీఈవో బొమ్ము కోటిరెడ్డి పాల్గొన్నారు.

పనిచేయని ఆర్వో ప్లాంట్

● పట్టించుకోని అధికారులు



మున్సిపల్ కార్యాలయంలోని ఆర్వో ప్లాంట్

తెనాలి (మారీసుపేట) డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని ఆర్వో ప్లాంట్ పని చేయట్లేదు. వివిధ పనుల నిమిత్తం ఇక్కడికి వచ్చే ప్రజలకు తాగునీటి సౌకర్యం లేకుండా పోవడంతో ఇబ్బంది పడుతున్నారు. గత మూడు నెలలుగా పనిచేయని ఆర్వో ప్లాంట్‌పై సంబంధిత శాఖ అధికారులు దృష్టిపెట్టడం లేదు. పని చేయని ఆర్వో ప్లాంట్‌పై ' రిపేరులో ఉంది కావున పనిచేయుటలేదు' అని బోర్డు పెట్టారే తప్ప, మరమ్మతులు మాత్రం చేయించట్లేదు. ఈ ప్లాంట్‌కు మరమ్మతులు చేపట్టకపోవడంపై వివిధ పనుల నిమిత్తం ఇక్కడికి వచ్చే వారు విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు చేయాలనికోరుతున్నారు.

తెనాలి-నారాకోడూరు నాలుగులైన్ల రోడ్డుకు సర్వే



తెనాలి రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో తెనాలి నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే రోడ్ల మరమ్మతులు సైతం చేపట్టకపోవడంతో అధ్వానంగా తయారై ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే రోడ్ల అభివృద్ధికి నడుంబిగించింది. అందులో భాగంగా తెనాలి - మంగళగిరి రోడ్డు పనులు జరుగుతున్నాయి. తెనాలి నుంచి గుంటూరుకు రెండు రోడ్డు మార్గాలు ఉండగా అందులో తెనాలి - అంగలకుదురు - నారాకోడూరు - గుంటూరు మార్గానికి త్వరలో మహర్దశ రాబోతుంది. ఆర్ అండ్ బీకి ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు తెనాలి - నారాకోడూరు రోడ్డును నాలుగు వరుసల రోడ్డుగా మార్చేందుకు సర్వే పనులు చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం సంబంధిత శాఖ యంత్రాంగం రోడ్డు పొడవు, వెడల్పులను లెక్కించి మార్కిన్ల ఏర్పాటుకు గుర్తులు పెట్టారు. సర్వే రిపోర్టును ప్రభుత్వానికి పంపనున్నట్లు ఆర్ అండ్ బీ అధికారులు తెలిపారు.

హెల్మెట్ ధరించకపోవడంతోనే మరణాలు



హెల్మెట్‌పై అవగాహనా ర్యాలీలో సీఐలు రమేష్‌బాబు, శ్రీనివాసరావు

తెనాలి (మారీసుపేట) డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో అధికసంఖ్యలో ద్విచక్ర వాహనదారులు మృత్యువాత పడుతున్నారని, అందుకు ప్రధాన కారణం హెల్మెట్ ధరించకపోవడమేనని డీఎస్పీ జనార్ధనరావు అన్నారు. హెల్మెట్ ధరించడంపై డీఎస్పీ జనార్ధనరావు ఆధ్వర్యంలో శనివారం స్థానిక చెంచుపేట మార్కెట్ యార్డు నుంచి మార్కెట్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించకుండా వెళ్తున్న వాహనదారులకు ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలంటే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ద్విచక్రవాహనం ఇచ్చే సమయంలో వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా చూడాలని, మైనర్లకు ఎట్టిపరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వవద్దని చెప్పారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ రూరల్ సీఐలు మల్లికార్జునరావు, రామల నాయక్, రమేష్‌బాబు, శ్రీనివాసరావు, ఎస్సైలు ప్రకాశరావు, ప్రతాప్‌కుమార్, రాజ్యలక్ష్మి,పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

హిందూ మాదిగగా మార్పు చేయండి



సచివాలయంలో వినతిపత్రం అందిస్తున్న ఉన్నం ధర్మారావు మాదిగ

తెనాలి రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కుల ధ్రువీకరణ సర్వే ఆడిట్‌లో 'క్రిస్టియన్ మాదిగ' స్థానంలో 'హిందూ మాదిగగా' మార్పు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఉన్నం ధర్మారావు మాదిగ కోరారు. మండలంలోని కొలకలూరు గ్రామ సచివాలయంలో శనివారం వీఆర్వోలను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ధర్మారావు మాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ ఆధ్వర్యంలో ముప్పై ఏళ్ల నుంచి ఎస్సీ వర్గీకరణ కోసం చేసిన పోరాటాల ఫలితంగా సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం జిల్లాకు ఏకసభ్యకమిషన్ విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్‌రంజన్ మిశ్రా రానున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామ సచివాలయాలలో ఎగ్జిబిట్ చేసిన ప్రస్తుత ఎస్సీ కులధృవీకరణ సర్వే ఆడిట్ పత్రాలలో కొన్ని వందలకు పైగా క్రిస్టియన్ మాదిగగా నమోదు చేయబడి ఉన్నాయని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో న్యాయవాది సుద్దపల్లి మురళీధర్, పొన్నెకంటి చక్రవర్తి, పినపాటి రాజా, పలువురు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

తల్లి మందలించిందని రైలెక్కిన బాలిక

● తల్లికి అప్పగించిన రైల్వే పోలీసులు

తెనాలి క్రైం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : తల్లి చదువుకోమని మందలించడంతో అలిగిన ఓ బాలిక ఇంట్లో చెప్పకుండా రైలెక్కి తెనాలి వెళ్లింది. ఆ బాలికను రైల్వే పోలీసులు శుక్రవారం రాత్రి గుర్తించారు. ఈ మేరకు బాలిక తల్లికి, బంధువులకు సమాచారం ఇచ్చారు. తెనాలి ఆర్‌పీఎఫ్ ఎస్ఐ జీ వెంకటాద్రి తెలిపిన వివరాల ప్రకారం, నల్గొండ జిల్లా నకిరేకల్లుకు చెందిన ఆ బాలిక ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆమె తండ్రి మరణించాడు. తల్లి ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. కూతురు సరిగా కాలేజికి వెళ్లి చదువుకోవడం లేదని తల్లి మందలించింది. దీంతో, అలిగిన బాలిక శుక్రవారం నల్గొండ రైల్వేస్టేషన్‌కి వెళ్లి ఒంటరిగా డెల్టా ప్యాసింజర్ ఎక్కింది. తెనాలిలో రాత్రి 9 గంటల సమయంలో దిగి 1వ నెంబర్ ప్లాట్‌ఫారంపై ఉంది. అనుమానస్పదంగా ఉన్న ఆ బాలికను రైల్వే కానిస్టేబుల్ గుర్తించారు. వెంటనే బాలికను స్టేషన్‌కు తీసుకువచ్చి ప్రశ్నించగా అసలు సంగతి చెప్పింది. వెంటనే తల్లికి, బంధువులకు పోలీసులు సమాచారం ఇవ్వడంతో అర్ధరాత్రి 3.30 గంటల సమయంలో వారు రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. గుర్తింపు పరీక్షలు అనంతరం ఆ బాలికను వారికి అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

